





14.09.2026
సోమవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 124
పేజీలు : 08 | వెల: రూ.5



PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.




పాఠకులకు, ప్రకటనకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు

## సెలవు

వినాయక చవితి సందర్భంగా సోమవారం అనంత జనశక్తి ఆఫీసులకు సెలవు. కనుక మంగళవారం సంచిక వెలువడదు. బుధవారం మళ్లీ కలుద్దాం

# కేరళ ఆతిథ్యానికి పవన్ ఫిదా

- ప్రభుత్వ సహకారంపై ప్రశంసల వర్షం
- 21 రోజుల చికిత్సకు కేరళ ప్రభుత్వానికి థ్యాంక్స్
- భద్రత, సౌకర్యాలపై పవన్ ప్రశంసలు
- కేరళ ప్రజల ఆప్యాయతపై పవన్ భావోద్వేగం
- ప్రభుత్వ ఏర్పాట్లకు పవన్ కృతజ్ఞతలు
- పోలీస్, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు 2లో..





**తిరువనంతపురం, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

ఇటీవల ముంబైలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ .. దానికి కొనసాగింపుగా చికిత్స కోసం కేరళం వెళ్లిన సంగతి తెలిసిందే. చికిత్స పూర్తి చేసుకొని కేరళం నుంచి తిరిగి వచ్చే వేళ.. పవన్ కళ్యాణ్ భావోద్వేగానికి గురయ్యారు. కేరళం ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం, దేవాలయాల దర్శనాల గురించి ఆయన సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్టు చేశారు. 21 రోజులపాటు చికిత్స అందించినందుకు అటు కేరళం వైద్య బృందంతో పాటు కేరళం ప్రభుత్వానికి కూడా పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఢిల్లీ నుంచి స్వదేశాలకు దేశాధినేతల పయనం

- బ్రిక్స్ సదస్సు ముగింపు
- రష్యాకు పయనమైన పుతిన్
- చైనాకు బయల్దేరిన జిన్‌పింగ్
- మోదీ - పుతిన్ ద్వైపాక్షిక భేటీ
- కీలక అంశాలపై చర్చించిన ఇరు దేశాల నేతలు, అధికారులు








**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

భారత్ అధ్యక్షతన రెండు రోజుల పాటు ఢిల్లీలో అత్యంత వైభవంగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగిసిన నేపథ్యంలో ఆయా దేశాధినేతలు తమ స్వదేశాలకు తిరుగుప్రయాణమవుతున్నారు. సదస్సు ముగిసిన అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదివారం ఢిల్లీ నుంచి రష్యాకు బయలుదేరి వెళ్లిపోయారు. సదస్సులో భాగంగా పుతిన్ వివిధ గ్లోబల్ సెషన్లలో పాల్గొనడంతో పాటు 'భారత్ ఇన్నోవేట్స్' ప్రదర్శనను సందర్శించారు.

**పాశ్చాత్య దేశాల ఆంక్షలపై ఆగ్రహం**

బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నేతల సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ.. రష్యాపై పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలపై విరుచుకుపడ్డారు. రష్యాపై ఇప్పటివరకు 30,000 కంటే ఎక్కువ ఆంక్షలు విధించారని, ఇది ప్రపంచంలోని మిగిలిన అన్ని దేశాలపై ఉన్న మొత్తం ఆంక్షల కంటే రెండింతలు ఎక్కువని ఆయన వెల్లడించారు. 2లో..

# చేతల్లో ఉంటే ఎంతోమంది జైలుకు వెళ్లేవారు

- మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ వ్యాఖ్యలు
- రేవంత్ మాటల్లో ఉన్నంత స్ట్రాంగ్.. 6లో..
- చేతల్లో లేదని కామెంట్
- రేవంత్ రెడ్డి చాలా ఓపికగా ఎదురుచూసి..
- టైమ్ వచ్చినప్పుడు ముందుకు వెళ్లే స్వభావం





**హైదరాబాద్, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడే తీరులో కనిపించేంత గట్టితనం ఆయన చేతల్లో లేదని వ్యాఖ్యానించారు. ఒకవేళ మాటల్లో ఉన్నంత కఠినంగా రేవంత్ రెడ్డి తన చేతుల్లో వ్యవహరించి ఉంటే.. తెలంగాణలో ఈపాటికి ఎంతోమంది జైలుకు వెళ్లేవారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే రేవంత్ రెడ్డి చాలా ఓపికగా ఎదురుచూసి.. సమయం వచ్చినప్పుడు ముందుకు వెళ్లే స్వభావం కలిగిన వ్యక్తి అని టీజీ వెంకటేశ్ కితాబిచ్చారు.

## మోడీని కలిసిన స్కూల్ ఫ్రెండ్ అస్గర్ అలీ

- బీజేపీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు
- పాత భూ వివాదంపై సీబీఐ విచారణ జరపాలి

2లో..



## వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- ఏపీ-గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు
- పర్యావరణానికి ఎక్కువ ప్రాధాన్యత
- రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు 2లో..



## టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ అత్యాధునిక వైద్య సేవలు

2లో..

- మంత్రి దామోదర రాజనర్సింహా
- మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్‌తో ట్రీట్‌మెంట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదివారం ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత

2లో..



## నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడొద్దు జగన్

- హోంమంత్రి అనిత కామెంట్
- నిరుద్యోగుల ఆశలపై జగన్ నీళ్లు చల్లుతున్నారు 2లో..



## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

- తేమ ఒత్తిడిలో ఉన్న ప్రతి పంటను కాపాడాలి.. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ వినియోగించాలి
- రైతులకు అండగా ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు 6లో..



**అమరావతి, సెప్టెంబర్ 13:అనంత జనశక్తి ప్రతినిధి**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ ఒత్తిడికి గురవుతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

## కల్తీ మద్యం సేవించి తొమ్మిది మంది మృతి

నాగాలాండ్‌లో ఘోర విషాదం
డీజీపీ రుపిన్ శర్మ వెల్లడించారు

6లో..



## మంత్రి పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదు

- అకారణంగా తొలగించడం బాధ కలిగిస్తోంది
- మరోవైపు కొండా మురళి కూడా కీలక వ్యాఖ్యలు
- మంత్రిపదవి ఊడినా వెనక్కి తగ్గేది లేదు
- తేల్చి చెప్పిన కొండా దంపతులు
- కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు 2లో..





## ఢిల్లీ నుంచి స్వదేశాలకు
# దేశాధినేతల పయనం

(మొదటి పేజీ తరువాయి)

దౌత్య, వాణిజ్య ఒత్తిళ్లను అసంబద్ధ పోటీ తత్వానికి వాడుకుంటున్నారని మండిపడ్డారు.

మోదీ పుతిన్ ద్వైపాక్షిక భేటీ

సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్‌లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బిష్కెక్ (బిష్కెక్) లో జరిగిన SCO సదస్సు తర్వాత రెండు వారాల్లోనే వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి. ఈ భేటీలో 'ప్రోగ్రామ్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ 2030' అమలుతో పాటు రక్షణ, ఇంధనం, మౌలిక వసతులు, సాంకేతికత, సాంస్కృతిక రంగాలలో పరస్పర సహకారంపై చర్చించారు.

పశ్చిమాసియా, నల్లసముద్రం సంక్షోభం

పశ్చిమాసియా, నల్లసముద్రం ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, నౌకాయాన వాణిజ్యం, భారతీయ నావికుల భద్రతపై ప్రభావం చూపుతున్న అంశాలపై ఇరునేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. ఎలాంటి వివాదానికైనా దౌత్యం, నిరంతర చర్చలే పరిష్కార మార్గమని, శాంతి ప్రయత్నాలకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రష్యా అధ్యక్షుడితో పాటు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీ కూడా సదస్సు ముగించుకుని ఢిల్లీ నుంచి స్వదేశాలకు తిరుగు పయనమయ్యారు.

## టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ
# అత్యాధునిక వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణకు
# ప్రత్యేక చర్యలు

**అమరావతి, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

పర్యావరణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీగ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు తెలిపారు. అడవులను రక్షించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2047 నాటికి రాష్ట్రంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకువెళ్తమన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అక్కడ ఉన్న కుంకీ ఏనుగులకు ఆహారం అందించి, వాటి పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## నిరుద్యోగుల జీవితాలతో
# ఆటలాడొద్దు జగన్

**అమరావతి, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

నిరుద్యోగ యువత జీవితాలతో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటలాడటం సమంజసం కాదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై జగన్ నీళ్లు చల్లుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి, పరీక్షలు రాసి తమ భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులతో రాజకీయాలు చేయడం సరికాదని అనిత పేర్కొన్నారు. యువత భవిష్యత్తుపై తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని వైఎస్ జగన్ చూస్తున్నారని అనిత మండిపడ్డారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ప్రతి అడుగులోనూ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ.. అర్హత, ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకతకు ఎలాంటి లోటు ఉండదని, యువత భవిష్యత్తు విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను పోస్టు చేశారు.

# మోడీని కలిసిన స్కూల్ ఫ్రెండ్ అస్గర్ అలీ

- ప్రధానిని కోరినట్లు సమాచారం
- సుమోటోగా స్వీకరించిన మున్సిపల్ అధికారులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

ప్రధాని నరేంద్రమోడీని ఆయన చిన్ననాటి స్కూల్ ఫ్రెండ్ అస్గర్ అలీ వోహ్రా ఇటీవల కలిశారు. తనకు సంబంధించిన పాత భూ వివాదంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని ప్రధానిని కోరినట్లు సమాచారం. ఈమేరకు ఆయన ప్రధానికి ఒక లేఖ కూడా అందించారు. 81 ఏళ్ల అస్గల్ అలీ గుజరాత్ వడ్నగర్‌లో బీఎన్ స్కూల్‌లో మోడీతో కలిసి చదువుకున్నారు. సెప్టెంబర్ 8, 2026న ఆయన ప్రధానిని కలిశారు.

మహారాష్ట్రంలోని భయందర్, నవ్‌ఘర్ రోడ్ ప్రాంతంలో ఉన్న 2810 చదరపు మీటర్ల భూమికి సంబంధించిన వివాదంపై అస్గర్ అలీ ప్రధానిని కలిశారు. 1989లో రిజిస్టర్డ్ ఒప్పందం ద్వారా తాను ఈ భూమిని కొనుగోలు చేసినట్లు వోహ్రా తన లేఖలో పేర్కొన్నారు. తాను ఆ భూమిని ఎవరికీ విక్రయించలేదని, మరెవరికి బదిలీ చేయలేదని ఆయన చెప్పారు. 2011లో తన భూమికి సంబంధించిన నకిలీ పత్రాలు సృష్టించారని, ఇందులో ''స్వయం బిల్డర్స్'' కుమ్మకయ్యారని ఆరోపించారు.

**బీజేపీ ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు చెందినవిగా పేర్కొన్న 'సెవెన్ ఎలెవెన్ కన్స్ట్రక్షన్స్', 'స్వయం బిల్డర్స్' సంస్థలపై వోహ్రా ఆరోపణలు చేశారు. తనకు తెలియకుండా భూమిని రెండు భాగాలుగా విభజించినట్లు ఆయన పేర్కొన్నారు. భూమిని రెండు బిల్డర్స్ సంస్థలు ఆక్రమించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో 2015లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కేసు దర్యాప్తు సుమారు 11 ఏళ్ల తర్వాత 2026లో సీఐడీ నివేదిక ఇచ్చిందని అస్గర్ లేఖలో ఆరోపించారు. కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అస్గర్ ప్రధానిని కలిసిన తర్వాత, స్థానిక మున్సిపల్ అధికారులు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించారు. ఈ కేసు ఇప్పుడు 2026 సెప్టెంబర్ 16న విచారణకు రానుంది. ఈ విచారణఖు హాజరు కావాలని రెండు కంపెనీలను అధికారులు ఆదేశించారు.**

# కేరళ ఆతిథ్యానికి పవన్ ఫిదా

(మొదటి పేజీ తరువాయి)

కేరళం పోలీసు, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలకు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. ముంబైలో భుజానికి శస్త్రచికిత్స చేసిన తరువాత దానికి కొనసాగింపుగా కేరళంలోని డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రిట్రీట్‌లో పవన్ చికిత్స తీసుకున్నారు. ''దాదాపు 21 రోజుల పాటు సాగిన ఈ చికిత్స సమయంలో కేరళం ప్రజల ఆప్యాయత, ఆదరణ తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపించినట్లు పవన్ చెప్పారు. తనకు ఇది కేవలం చికిత్స కాలం మాత్రమే కాదని.. స్వస్థత, ప్రశాంతత, మధుర జ్ఞాపకాల సంపాదించుకునే సమయమని వివరించారు.

కేరళంలో ఉన్న సమయంలో త్రిప్రయార్ శ్రీరామ స్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ్, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను పవన్ దర్శించుకున్నారు. శతాబ్దాల చరిత్ర, సంప్రదాయాలతో ఉన్న ఈ ఆలయాల దర్శనంతో తాను ఎంతో ప్రశాంతతను, భక్తి భావాన్ని పొందానని చెప్పారు. కేరళ ఆలయాలు మన ప్రాచీన నాగరికత,



వారసత్వానికి సజీవ ప్రతిరూపాలని పవన్ కళ్యాణ్ అభివర్ణించారు.

తన పర్యటన సజావుగా సాగేందుకు సహకరించిన కేరళ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వి.డి. సతీశన్, డీజీపీ, కేరళ పోలీసు బృందాలు, త్రిశూర్, అలప్పుజ, కొచ్చి జిల్లా యంత్రాంగాలకు పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. స్టేట్ ప్రోటోకాల్ విభాగం అందించిన సహకారం, ఏర్పాట్లను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రతి దశలోనూ భద్రత, సౌకర్యాల విషయంలో చూపిన వృత్తిపరమైన శ్రద్ధను ఆయన అభినందించారు. థ్యాంక్యూ కేరళ..'' అంటూ పవన్ ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు.

**పవన్‌కు కేరళం సీఎం ధన్యవాదాలు..**

పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా పోస్టుకు కేరళ సీఎం వీడీ సతీశన్ స్పందించారు. విశ్రాంతి తీసుకోవడానికి, చికిత్స కోసం తమ రాష్ట్రానికి వచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేరళం ప్రజల ఆప్యాయత, చారిత్రక ఆలయ దర్శనాలు ఆయనకు శాంతి, స్వస్థత అందించాయని తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. 'త్వరలో మరోసారి ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నాం. పవన్ పూర్తిగా కోలుకుని మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాం' అని సతీశన్ పోస్టు చేశారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత

- గరుడ సేవకు ముందే అలర్ట్
- భక్తుల రద్దీకి చెక్ పెట్టేలా ప్రణాళికలు
- 5,300 మంది సిబ్బందితో బందోబస్తు
- ప్రత్యామ్నాయ పార్కింగ్, ప్రత్యేక ఫ్యాక్ట్ చెక్ సెల్

**తిరుమల, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఈసారి భద్రతా ఏర్పాట్లలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే వేళ రద్దీ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం లేకుండా చూడటం, గ్యాలరీల్లో భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు అంచనా వేయడం లక్ష్యంగా తితిదే సరికొత్త విధానాలను అమలు చేయనుంది. ప్రత్యేకంగా జియో నెట్‌వర్క్ స్లైసింగ్, ఏఐ ఆధారిత హెడ్ కౌంటింగ్, కొత్త ఎగ్జిట్ ప్లాన్‌తో భద్రతను మరింత పటిష్ఠం చేయనుంది. గరుడ సేవ వంటి ప్రధాన రోజుల్లో తిరుమల మాడ వీధులకు భారీగా భక్తులు చేరుకుంటారు. ఈసారి సుమారు 3.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా. ఇంతటి రద్దీ సమయంలో సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు రద్దీతో స్తంభించడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీ ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. దీనికి పరిష్కారంగా తితిదే జియోతో కలిసి ప్రయోగాత్మకంగా 'నెట్‌వర్క్ విథిన్ ది నెట్‌వర్క్' పేరుతో నెట్‌వర్క్ స్లైసింగ్ సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది.

దీనిలో భాగంగా 30 అధునాతన కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. సాధారణ ఫోన్లు, కమ్యూనికేషన్ సెట్లు పనిచేయకపోయినా ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో అనుసంధానమై పనిచేసేలా రూపొందించారు. లేపాక్షి సెంటర్, వరాహస్వామి గెస్ట్‌హౌస్, నాదనీరాజనం, కమాండ్ కంట్రోల్ రూమ్ సహా 11 కీలక సబ్‌కంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్నతాధికారులకు వీటిని అందించనున్నారు. గ్యాలరీల నుంచి భక్తులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో రద్దీ, తోపులాటలు తలెత్తకుండా ఈసారి దిశల వారీగా కొత్త ఎగ్జిట్ ప్లాన్ అమలు చేయనున్నారు. ఏ మాడ వీధిలో ఉన్న భక్తులు అదే దిశలో బయటకు వెళ్లేలా మార్గాలను నిర్దేశించారు. దక్షిణ మాడవీధి భక్తుల కోసం ఎస్3 గేట్ వద్ద ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి లేదా తిరుమల బస్టాండ్‌కు చేరుకునే అవకాశం కల్పించనున్నారు.

గ్యాలరీల్లో రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 200 కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి ప్రతి ప్రాంతంలో ఉన్న భక్తుల సంఖ్యను రియల్‌టైమ్‌లో గుర్తించేలా వ్యవస్థను రూపొందించారు. ఏదైనా గ్యాలరీ సామర్థ్యానికి చేరుకుంటే వెంటనే అప్రమత్తమై భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించవచ్చు. అలిపిరి టోల్‌గేట్, నడకమార్గాలు, శ్రీవారి మెట్టు వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొత్తం సుమారు 3 వేల కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టనున్నారు. దొంగతనాలను అరికట్టేందుకు 40 విజిలెన్స్ బృందాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి క్రైమ్ బృందాలను కూడా రప్పించారు. విజిలెన్స్, పోలీసు సిబ్బంది కలిపి 5,300 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుమలలో సుమారు 4,600 వాహనాలకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉండటంతో ఆ పరిమితి దాటిన వెంటనే తిరుపతిలోని ఏడు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పార్కింగ్ సదుపాయాలను వినియోగించనున్నారు.

వదంతులకు అడ్డుకట్టగా ఫ్యాక్ట్ చెక్ సెల్

సోషల్ మీడియాలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వ్యాపించే తప్పుడు ప్రచారం, వదంతులను వెంటనే గుర్తించి అడ్డుకునేందుకు ప్రత్యేక ఫ్యాక్ట్ చెక్ సెల్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినా, ఏదైనా ఇబ్బంది ఎదురైనా వెంటనే 08772263828, 98668 98630 నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చు. సాంకేతికత, పర్యవేక్షణ, రద్దీ నిర్వహణను సమన్వయం చేస్తూ ఈసారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతకు తితిదే చర్యలు చేపడుతోంది.

# మంత్రి పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

మంత్రివర్గం నుంచి తొలగించడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ స్పందించారు. పదవి పోయినందుకు తనకు ఎలాంటి బాధ లేదని, కానీ ఎటువంటి కారణం లేకుండా తొలగించడం మాత్రం మనస్తాపానికి గురిచేసిందని పేర్కొన్నారు. బర్తరఫ్ వేటు పడిన అనంతరం వరంగల్‌లో తొలిసారిగా తన మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలతో కొండా దంపతులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాల్లో అవకాశవాదం ఎక్కువైపోయిందని విమర్శించారు. పదవుల కంటే ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎంపీపీ స్థాయి నుంచి మంత్రి పదవి వరకు ఎదిగానని, గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోసం ఎలాంటి ఆలోచన లేకుండా పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు.



ఉదయం ఒక పార్టీలో ఉండి మధ్యాహ్నానికి మరో పార్టీ కండువా కప్పుకునే సంస్కృతి తమది కాదని, కొందరు వార్డు మెంబర్ పదవికి కూడా రాజీనామా చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్‌లో కొందరు కుట్రలు చేసి తమకు టికెట్ రాకుండా అడ్డుకున్నప్పుడు కేసీఆర్ పిలిచి వరంగల్ ఈస్ట్ టికెట్ ఇచ్చారని, అక్కడ పోటీ చేసి నాటి అధికార పార్టీ మంత్రిని ఓడించామని సురేఖ చెప్పారు.

'పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. పదవి లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తాం. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తాం. ఇక బర్తరఫ్ వార్త తెలిసిన తర్వాత కొందరు కార్యకర్తలు ఆందోళనలు చేద్దామని ఫోన్ చేశారు. కానీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని అందరికీ నచ్చజెప్పాం. అలాగే రేవంత్ రెడ్డి రైతు పాదయాత్ర సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఆయనలాంటి మాస్ లీడర్ అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని నేనే.' అని సురేఖ అన్నారు.

సారీ చెప్పే ప్రసక్తే లేదు: కొండా మురళి

ఈ సమావేశంలో కొండా మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ఆశయమని తెలిపారు. 'మంత్రి పదవి దక్కించుకోవడం కంటే ఆత్మగౌరవంతో బతకడమే ముఖ్యం. సురేఖను క్షమాపణలు చెప్పాలని కొందరు కోరారు. కానీ పదవి ఊడినా పర్లేదు గానీ సారీ చెప్పేది లేదని నా భార్య తేల్చి చెప్పింది. మా రక్తంలోనే కృతజ్ఞత ఉంది, మాట కోసం నిలబడే తత్వం మాది.' అని కొండా మురళి స్పందించారు.

# 'అంతా ఓకేనా?'

- ప్రసంగాన్ని ఆపి మరీ జిన్‌పింగ్ గురించి మోదీ ఆరా
- బ్రిక్స్ సదస్సులో అరుదైన సన్నివేశం
- జిన్‌పింగ్ కోసం తన ప్రసంగాన్ని కాసేపు ఆపేసిన మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

న్యూఢిల్లీ వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో సభ్యదేశాల అధినేతలతోపాటు ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థల అధిపతులు కూడా హాజరయ్యారు. ఈ సదస్సులో పాల్గొనడానికి చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ వస్తారా, లేదా అని విషయంలో చివరి వరకు సస్పెన్స్ నడిచింది. అయితే శనివారం తెల్లవారుజామున బీజింగ్‌లో బయల్దేరిన జిన్‌పింగ్ మధ్యాహ్నం సమయానికి ఢిల్లీ చేరుకున్నారు. ఏడేళ్ల తర్వాత భారత్‌లో పర్యటిస్తోన్న జిన్‌పింగ్ ఈ బ్రిక్స్ సమావేశాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

భారత్ మండపంలో జరిగిన బ్రిక్స్ దేశాధినేతల సదస్సు ప్రారంభం సందర్భంగా అధ్యక్ష హోదాలో ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమయంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అసౌకర్యంగా కనిపిస్తుండటాన్ని గమనించిన మోదీ తన ప్రసంగాన్ని కాసేపు నిలిపేశారు. చిన్నపాటి కలకలం రేగడంతో మాట్లాడటం ఆపేసి, జిన్‌పింగ్ వైపు తిరిగి చూశారు. 'అంతా ఓకేనా?' అని చైనా అధినేతతో ఉన్న చైనీస్ అనువాదకుడిని అడిగారు. కొద్ది సేపటి తర్వాత మళ్లీ అదే ప్రశ్నను అడిగారు. అయితే జిన్‌పింగ్ అసౌకర్యానికి గురి కావడానికి కారణం ఏంటనేది వెంటనే తెలియలేదు. కొన్ని సెకన్ల తర్వాత అంతా ఓకే అన్నట్లుగా జిన్‌పింగ్ తల ఆడించారు. దీంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సన్నివేశం దూరదర్శన్ యూట్యూబ్‌లో పోస్టు చేసిన ఫుటేజీలో నమోదైంది.

జిన్‌పింగ్ చివరగా 2019లో భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు, ఉద్రిక్తతల కారణంగా ఇంత కాలంపాటు ఆయన ఇండియాకు రాలేదు. 2024 నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి బలపడుతున్నాయి. ఈ క్రమంలోనే జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు కోసం భారత్‌కు వచ్చారు. శనివారం తెల్లవారుజామున చైనా నుంచి బయల్దేరిన జిన్‌పింగ్ మధ్యాహ్నం కల్లా ఢిల్లీలో అడుగుపెట్టారు. 2 గంటలకు ప్రారంభమైన బ్రిక్స్ సమావేశంలో పాల్గొన్న జిన్‌పింగ్.. ఆ తర్వాత ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. తీరిక లేని షెడ్యూల్ కారణంగా ఆయనకు విశ్రాంతి తీసుకోవడం కుదరలేదు. దీంతో ఒకింత అసౌకర్యంగా కనిపించారు. అందువల్లే బ్రిక్స్ దేశాధినేతలకు మోదీ ఇచ్చిన డిన్నర్‌లో ఆయన పాల్గొనలేదని తెలుస్తోంది.

బ్రిక్స్ సదస్సు ప్రారంభం కావడానికి ముందు భారత్ మండపంలో జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ సాదర స్వాగతం పలికారు. తమిళనాడులోని ప్రసిద్ధ రామనాథస్వామి ఆలయానికి చెందిన 1212 స్తంభాల ప్రాకారాన్ని చూపే ప్రొజెక్షన్ ముందు ఇద్దరు నేతలు కరచాలనం చేశారు. 2019లో జిన్‌పింగ్ భారత్‌కు వచ్చిన తమిళనాడులోనే ప్రధాని మోదీ ఆయనతో భేటీ అయ్యారు. బహుశా నాటి పర్యటన స్మృతులను గుర్తు చేయడం కోసం మోదీజిన్‌పింగ్ తాజా భేటీలో రామనాథ స్వామి ఆలయ చిత్రాన్ని నేపథ్యంగా ఉపయోగించుకొని ఉంటారని భావిస్తున్నారు.

బ్రిక్స్ సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలిసి మాట్లాడుతున్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. గత ఏడాది తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సమయంలో ఈ ముగ్గురు ప్రపంచ నేతలు కలుసుకున్న ఫొటో వైరల్ అయ్యింది. ఇదే తరహాలో ప్రస్తుత ఫొటోలు సైతం ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. పుతిన్, జిన్‌పింగ్‌ల చేతులను ప్రధాని మోదీ పట్టుకోవడం.. ముగ్గురు నేతలు కలిసి సరదాగా మాట్లాడుకోవడం వాళ్ల మధ్య ఉన్న బలమైన బంధాన్ని, భవిష్యత్ వరల్డ్ ఆర్డర్‌ను సూచిస్తోంది.

భారత్, చైనా మధ్య సరిహద్దు సమస్య ఇప్పటి వరకూ సమసిపోలేదు. అయినా సరే ఇది మోదీ, జిన్‌పింగ్ మధ్య చర్చలకు ఆటంకం కాలేదు. అభిప్రాయ బేధాలు వివాదాలుగా మారొద్దని.. ఇరు దేశాలు వ్యూహాత్మక వైఖరితో, దీర్ఘకాలిక దృష్టితో కలిసి పని చేయాలని మోదీ, జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు.

భారత్, చైనా మధ్య సంబంధాలు మెరుగుపడటానికి సరిహద్దుల్లో శాంతి, సామరస్యతలు అత్యంత ఆవశ్యకమైనవని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్తూనే సరిహద్దు సమస్యను ఒకేసారి పరిష్కరించాలని చైనా పిలుపునిచ్చింది.

# భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్

- హైస్పీడ్ "ఇవోల్గా" రైలు ప్రతిపాదన
- గంటకు 360 కి.మీ వేగంతో ప్రయాణించే సత్తా
- ఇప్పటికే వందేభారత్ స్లీపర్ ప్రాజెక్టులో భాగమైన కంపెనీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

భారత్ తన పాతకాలపు రైల్వే వ్యవస్థను ఆధునీకీకరించే పనిలో ఉంది. ఈ నేపథ్యంలోనే వందేభారత్, వందే భారత్ స్లీపర్, నమో భారత్, బుల్లెట్ ట్రైన్ వంటి ప్రాజెక్టుల్ని తీసుకువచ్చింది. ఇదిలా ఉంటే, రష్యా తనక హైస్పీడ్ ట్రైన్ టెక్నాలజీని భారత్‌కు ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇన్నోప్రోమ్.ఇండియా కార్యక్రమంలో ఈ ప్రతిపాదనను సమర్పించినట్లు తెలుస్తోంది. రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ సంస్థ తన ''ఇవోల్గా హై స్పీడ్ రైలు''ను భారత్‌కు ఇవ్వాలనుకుంటోంది.

గంటలకు 360 కి. మీ వేగం..

రష్యా ప్రతిపాదించిన ఇవోల్గా హైస్పీడ్ రైలు గంటకు 360 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. 8 బోగీలు ఉండే ఈ రైలు 642 మంది ప్రయాణికుల్ని తీసుకెళ్తుంది. దీని జీవిత కాలం 30 ఏళ్లు. ఈ రైలు సుమారు 80 శాతం స్థానిక పరికరాలు ఉపయోగించిన నిర్మించవచ్చని రష్యా ప్రతిపాదించింది. టెక్నాలజీ బదిలీ, స్థానిక తయారీకి అవకాశం కల్పిస్తే ఇది భారత్ చేపడుతున్న ''మేక్ ఇన్ ఇండియా'', 'ఆత్మ నిర్భర భారత్'' లక్ష్యాలను నెరవేర్చినట్లు అవుతుంది.

వందే భారత్‌లో భారత్‌లోకి ఎంట్రీ..

ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ ఇప్పటికే భారత రైల్వే రంగంలో భాగస్వామిగా ఉంది. వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీలో భారత్‌తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 120 వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ ఒప్పందం కుదిరింది. ఈ అనుభవం ఆధారంగా రష్యా ఇప్పుడు భారత్‌కు హైస్పీడ్ రైలును ఆఫర్ చేస్తోంది.

మౌలిక సదుపాయాలు ముఖ్యమే..హైస్పీడ్ రైలు పరుగులు తీయాలంటే దానికి అనుగుణంగా రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, విద్యుదీకరణం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ ఇలా అన్నింటిని చూసుకోవాల్సి ఉంటుంది. హైస్పీడ్ రైళ్లకు తగ్గట్లుగా ట్రాక్ మార్పులు చేయాల్సి ఉంటుంది. దీంతో రష్యా ప్రతిపాదనను భారత్ అంగీకరించే ముందు రైలు వేగంతో పాటు మొత్తం ప్రాజెక్టు వ్యయం, భద్రత, నిర్వహణ, స్థానిక తయారీ, టెక్నాలజీ బదిలీ వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఒక వేళ ఇవోల్గా ప్లాన్ కార్యరూపం దాలిస్తే భారత్‌రష్యా సహకారం ఇప్పుడు రైల్వేకు విస్తరించినట్లు అవుతుంది. రైళ్లను నేరుగా దిగుమతి చేసుకోకుండా స్థానికంగా ఉత్పత్తి చేయడం వల్ల భారతీయ పరిశ్రమలకు సాంకేతికంగా కలిసి వస్తుంది.

# భూవివాదం.. దశాబ్దాలుగా పోరాటం.. విసిగిపోయి, చివరి ఆశగా ప్రధాని మోదీని కలిసిన స్కూల్‌మేట్

1989లో భూమిని కొనుగోలు చేసిన వోహ్రా.. ఆ స్థలాన్ని బీజేపీ ఎమ్మెల్యేకు చెందిన కంపెనీ తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకుందని ఆరోపిస్తూ న్యాయపోరాటం చేస్తున్నారు. 2015లో ఈ విషయమై ఎఫ్‌ఐఆర్ కూడా నమోదైంది. పదేళ్లు దాటినా ఈ వివాదం పరిష్కారం కాకపోవడంతో ఆయన విసిగిపోయారు. ఇక చేసేదేం లేక.. ఆయన చివరకు తన బాల్యమిత్రుడు, తనతో కలిసి పాఠశాల విద్యను అభ్యసించిన ప్రధాని నరేంద్ర మోదీని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన స్కూల్‌మేట్ అస్గరలీ వోహ్రా గతవారం కలిశారు. 81 ఏళ్ల వయసున్న ఆయన గుజరాత్‌లోని వాద్‌నగర్‌లోని బీఎన్ స్కూల్‌లో ప్రధాని మోదీతో కలిసి పాఠశాల విద్యను అభ్యసించారు. ఆయన ఈ వయసులో ప్రధాని మోదీని కలవడానికి ఓ కారణం ఉంది. ఆక్రమణకు గురైన తన భూమి విషయంలో.. దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్న వోహ్రా.. న్యాయం కోరుతూ, సీబీఐ విచారణ జరపాలని అభ్యర్థిస్తూ తన బాల్యమిత్రుణ్ని ఆశ్రయించారు.



మోదీ, వోహ్రా భేటీకి సంబంధించిన ఫొటోలు, ప్రెస్ నోట్‌ను గుజరాత్ రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ రిలీజ్ చేశారు. తన స్నేహితుడికి మోదీ న్యాయం చేస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

మహారాష్ట్రలోని థానే జిల్లాలోని భయందర్ ఈస్ట్ ప్రాంతంలోని నవ్‌ఘర్ ప్రాంతంలో 2810 చదరపు మీటర్ల స్థలాన్ని వోహ్రా కొనుగోలు చేశారు. 1989లో రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ద్వారా ఈ స్థలాన్ని ఆయన కొనుగోలు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ప్రాంతంలో ఉన్న ఈ స్థలాన్ని బీజేపీ ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధించిన స్వయమ్ బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ 2011లో ఆక్రమించాయని వోహ్రా ఆరోపిస్తున్నారు.

ఆస్తికి సంబంధించిన ఫోర్జరీ పత్రాలు సృష్టించి, అసలు యజమానికి తెలియకుండా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని వోహ్రా ఆరోపిస్తున్నారు. ఈ భూమిని రెండు భాగాలుగా చేసి.. స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ పేరిట స్వాధీనంలో ఉంచుకున్నారని ఆయన తెలిపారు. ఈ విషయమై 2015లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అప్పటి నుంచి న్యాయ కోసం తాను రెవెన్యూ విభాగం, మున్సిపల్ అధికారులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నానని ఆయన వాపోయారు. తాజాగా ప్రధాని మోదీని వోహ్రా కలవడంతో.. మున్సిపల్ యంత్రాంగం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. సెప్టెంబర్ 16న విచారణను షెడ్యూల్ చేయడంతోపాటు.. ఆ రోజు విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్, స్వయం బిల్డర్స్‌ను ఆదేశించింది.

# ఎకరం పొలంతో ఏడాదంతా సంపాదన.. రోజుకు రూ.12,500 ఆదాయం.. యువకుడి తెలివికి హ్యాట్సాఫ్



ప్రస్తుత కాలం వ్యవసాయం అత్యంత ఖరీదైపోయింది. వాతావరణ మార్పులు, ప్రతికూల పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భూమిని నమ్ముకున్న రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. కానీ, కొందరు మాత్రం తమకు ఉన్న కొద్దిపాటి భూమిలోనే అధునాత పద్దతుల్లో సాగుచేసి లాభాలు గడిస్తున్నారు. అటువంటి వ్యక్తే మహారాష్ట్రకు చెందిన యువ రైతు అర్జున్ సబలే. అగ్రికల్చర్ డిగ్రీ చదివిన ఈయన 2016లో పూల సాగును ప్రారంభించారు. తన ఎకరం పొలంలో ముందు పాతిక సెట్లతో ప్రయోగం చేపట్టి విజయవంతమయ్యారు.

ఒక్క ఏకరం పొలం, పంట చేతికి వచ్చే వరకు నెలల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా ప్రతిరోజూ స్థిరమైన ఆదాయాన్ని అందితే ఎలా ఉంటుంది? మహారాష్ట్రలోని అహల్యానగర్ జిల్లాకు చెందిన అర్జున్ సబలే అనే యువరైతు 'నేచరల్లీ వెంటిలేటెడ్ పాలిహౌస్'లో గులాబీలు, జెర్బెరా పూలను సాగు చేస్తూ దీనిని నిజం చేసి చూపించారు. ప్రస్తుతం ఆయన విజయగాథ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సబలే ఈ రెండు రకాల పూల పంటల ద్వారా రోజుకు రూ. 12,000 నుంచి రూ. 13,000 వరకు సంపాదిస్తున్నారు. ఆయన నెలవారీ టర్నోవర్ రూ. 3.5 లక్షలకు పైగా ఉండగా, నికర లాభం సుమారు రూ. 2.5 లక్షలుగా ఉంది.

**పావు ఎకరంతో పూల వ్యాపారం**

బంతి, చామంతి పూలను సాగు చేసే రైతు కుటుంబానికి చెందిన సబలే.. మార్కెట్లో ధరలు పడిపోవడం, సరఫరా ఎక్కువ కావడం వల్ల ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారించారు. అగ్రికల్చర్ విద్య అభ్యసిస్తున్న సమయంలో ఆయన వివిధ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రక్షిత సాగు విధానం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. 2016లో పావు ఎకరం విస్తీర్ణంలో గులాబీల సాగును ప్రారంభించారు.

మొదటి ప్రయత్నంలో రోజుకు సుమారు 500 గులాబీలు దిగుబడి వచ్చాయి. సగటు విక్రయ ధర పువ్వుకు రూ. 5 చొప్పున ఉండటంతో, ఆ చిన్న పొలం నుంచి రోజుకు దాదాపు రూ. 2,500 ఆదాయం లభించింది. ఈ విజయం ఇచ్చిన ఉత్సాహంతో సాగు విస్తీర్ణాన్ని పెంచి, జెర్బెరా పూల సాగును కూడా చేపట్టారు.

**ఒకే ఎకరంలో 32,000 మొక్కల సాగు**

ప్రస్తుతం సబలే తన ఒక ఎకరం పొలాన్ని గులాబీలు, జెర్బెరాను సమానంగా విభజించి, ఒక్కో రకానికి చెందిన 16,000 మొక్కల చొప్పున సాగు చేస్తున్నారు. ఈ తోట నుంచి ప్రతిరోజూ సుమారు 1,000 గులాబీలు, 2,000 జెర్బెరా దిగుబడి వస్తోందని ఆయన తెలిపారు. గులాబీ పువ్వుకు రూ. 5, జెర్బెరా పువ్వుకు రూ. 4 చొప్పున విక్రయిస్తే, ఈ రెండు పంటల ద్వారా రోజుకు సుమారు రూ. 13,000 వరకు అమ్మకాలు జరుగుతాయి. అయితే సబలే తమ రోజువారీ ఆదాయాన్ని సుమారు రూ. 12,000గా లెక్కించారు. కూలీలు, ఎరువులు, పురుగుమందులు, ప్యాకింగ్ ఖర్చులతో కలిపి ఆయన నెలవారీ వ్యయం సుమారు రూ. 1 లక్ష వరకు ఉంటుంది.

తక్కువ ఖర్చయ్యే పాలిహౌస్ ఎంపిక ఎందుకు?

ఎక్కువ విద్యుత్ అవసరమయ్యే క్లైమేట్‌కంట్రోల్డ్ నిర్మాణానికి బదులుగా, 'నేచరల్లీ వెంటిలేటెడ్ పాలిహౌస్'ను అర్జున్ ఎంచుకున్నారు. ఈ విధానంలో పైకప్పు వెంటిలేటర్లు, పక్కల ద్వారా గాలి ప్రసరణ సులభంగా జరుగుతుంది. దీనివల్ల కూలింగ్ ఫ్యాన్లు, విద్యుత్ వినియోగం తగ్గుతుంది. 201516లో ఆయన ఏర్పాటు చేసిన మొదటి 10,000 చదరపు అడుగుల నిర్మాణానికి దాదాపు రూ. 3 లక్షలు ఖర్చయింది. ఈ విధానం రక్షిత సాగు దిశగా జరుగుతున్న విస్తృత పురోగతిని ప్రతిబింబిస్తుంది. పుణేలోని 'ICARDFR' శాస్త్రవేత్తలు ఇటీవల మహారాష్ట్రలోని గులాబీ రైతులతో కలిసి సుస్థిర రక్షిత సాగుపై పనిచేశారు. అందులో ఫెర్టిగేషన్, జీవసంబంధిత ఉత్పాదకాలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను సిఫార్సు చేశారు. 'శాస్త్రీయ నిర్వహణ పద్ధతులు మెరుగైన ఉత్పాదకతకు, ఆర్థిక రాబడికి దోహదపడతాయి' అని ఈ సంస్థ పేర్కొంది.

**మహారాష్ట్రలో జెర్బెరా సాగుకు ఆదరణ**

మహారాష్ట్రలో పూల సాగుకు సబలే అనుభవమే ఏకైక ఉదాహరణ కాదు. కరువు ప్రాంతమైన ఉస్మానాబాద్‌లోని రైతులు రక్షిత జెర్బెరా సాగును చేపట్టి లాభాలను ఆర్జిస్తున్నారు. ఆ జిల్లాలో పాలిహౌస్‌ల సంఖ్య 2014 నుంచి 2017 మధ్య కాలంలో 29 నుంచి 266కి పెరిగింది. ఆ సమయంలో ఒక్క పడోలి గ్రామంలోనే 20కి పైగా జెర్బెరా పాలిహౌస్‌లు ఉన్నాయి. జెర్బెరా, గులాబీల రక్షిత సాగు ద్వారా వ్యవసాయ రాబడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఐసీఏఆర్ (ICAR) కూడా నివేదించింది.

సాగు నుంచి నిరంతర ఆదాయం

సబలే విజయంలో అత్యంత కీలకమైన అంశం నిరంతర ఆదాయం లభించడమే. పంట చేతికి రావడానికి నెలల సమయం పట్టే సాధారణ పంటల లాగా కాకుండా, గులాబీలు, జెర్బెరా పూలను ప్రతిరోజూ కోయవచ్చు. ఆయన స్థానిక పూల దుకాణాలతో పాటు పెద్ద మార్కెట్లలో కూడా పూలను విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి జెర్బెరా పూలను ముంబయి, బెంగళూరు, అహ్మదాబాద్, వడోదర, హైదరాబాద్ వంటి నగరాలకు రవాణా చేస్తున్నారు. పంట వైవిధ్యం, రక్షిత సాగు, నేరుగా మార్కెటింగ్ సదుపాయం ద్వారా ఒక చిన్న పొలం ఆర్థిక స్థితిని ఎలా మార్చవచ్చో అర్జున సబలే కథ నిరూపిస్తోంది. పొలం విస్తీర్ణాన్ని పెంచడం కంటే, ఉన్న ల్యాండ్ నుంచే ఎక్కువ రాబడి పొందడంపై సబలే దృష్టి పెట్టి.. ఒక ఎకరాన్ని ఏడాదంతా ఆదాయం ఇచ్చే పూల వ్యాపారంగా మలిచారు.

# "సీఎం పదవికి రాజీనామా చేస్తున్నాను".. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కే.. ఎంపీ సర్కారుపై సెటైర్లు

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే.. తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి రిజైన్ చేస్తున్నట్లుగా రాజీనామా లేఖను సోషల్ మీడియాను పోస్టు చేశారు. ఈ వ్యంగ్య లేఖ ద్వారా మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా మరణించిన గిరిజన పిల్లల తల్లిదండ్రులను పరామర్శించడానికి వెళ్లిన దీప్కేను, బాలాఘాట్‌లో కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు అడ్డగించారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే దీప్కే ఆదివారం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

"నేను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను. మధ్యప్రదేశ్ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. అయితే ఈ అవకాశాన్ని వాడుకోవడంలో నేను పూర్తిగా విఫలమయ్యాను" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఎక్స్‌లో ఓ లేఖను పంచుకున్నారు. ఈ పోస్టుకు మధ్యప్రదేశ్ గవర్నర్‌ను కూడా ఆయన ట్యాగ్ చేశారు. సీఎం పదవికి దీప్కే రాజీనామా చేయడం ఏంటని అనుకుంటున్నారా? మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై సెటైరికల్ రాసిన లేఖ ఇది.

ఈ లేఖలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలును గురించి దీప్కే ప్రస్తావిచారు. సాగర్ కల్తీ మద్యం విషాదం, బాలాఘాట్ ఇన్ఫెక్షన్ మరణాలు తదితర సమస్యలపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, అతని సహచరులను ఎద్దేవా చేస్తూ మాట్లాడారు.

దీప్కే పోస్ట్‌పై సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా స్పందిస్తూ, ఆయన బాధ్యతల నుంచి "పారిపోతున్నాడని" సరదాగా వ్యాఖ్యానించారు.

అంటువ్యాధుల కారణంగా మరణించారని చెబుతున్న గిరిజన పిల్లల కుటుంబాలను కలవడానికి, స్థానిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల గురించి సమాచారం సేకరించడానికి అభిజీత్ దీప్కే శనివారం మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లోని అడోరి, కోర్కా, బొండారి గ్రామాలను సందర్శించారు.

వైరల్ అయిన ఒక వీడియోలో, దీప్కే కారులో వెళ్తుండగా ఒక మహిళా 'ఇన్‌ఫ్లుయెన్సర్' అతని ముఖానికి మైక్ పెట్టి, "శవాలపై రాజకీయాలు చేయడానికి" వచ్చారా? ఇంత ఆలస్యంగా ఆ ప్రాంతానికి ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించింది. ఆలస్యంగా వచ్చినందుకు క్షమాపణలు చెబుతున్నట్లు దీప్కే చెప్పడం వినిపించింది.

"ఇక్కడ ఒక మంచి రోడ్డు వేశారు. మీకు కనిపించడం లేదా?" అని ఆ మహిళ అనడం కూడా వినిపించింది. పరిస్థితి చేజారిపోతుండటంతో, సీజేపీ కార్యకర్తలు దీప్కేను మరో కారులో ఎక్కించి తీసుకువెళ్లారు. సీజేపీ వ్యవస్థాపకుడు వెళ్లిపోతుండగా, "అతను పారిపోయాడు, అతను పారిపోయాడు" అని ఆ మహిళ అనడం ఆ వీడియోలో వినిపించింది.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల బృందం ఆ మారుమూల గ్రామానికి రావడం చూసి తాము



Abhijeet Dipke
Chief Minister
Madhya Pradesh

GOVERNMENT OF MADHYA PRADESH

Mantralaya
Bhopal – 462004
Madhya Pradesh

13 August 2026

To,
The Hon'ble Governor of Madhya Pradesh
Raj Bhavan, Bhopal

Respected Sir,

I hereby tender my resignation from the office of the Chief Minister of Madhya Pradesh.

My conscience does not allow me to continue occupying this chair after the deaths of more than 30 Tribal children in Balaghat. As Chief Minister, I accept responsibility for failing to provide them with the timely medical care and support they needed. Many of these lives could possibly have been saved, and I cannot escape responsibility for that failure.

What is equally shameful is our insensitivity after their deaths. We initially announced compensation of merely ₹2 lakh per child, increasing it to ₹4 lakh only after the Tribal community protested. It forces me to ask an uncomfortable question: would we have considered ₹4 lakh adequate had these been the children of Ministers or MLAs? Our response reflects how little value we have placed on the lives of Tribal children.

Despite the gravity of this tragedy, we have also failed to hold health officials accountable. The deaths of innocent children demand accountability at the highest level.

Our failures go beyond healthcare. While our Hon'ble Prime Minister, Shri Narendra Modi ji, aka Vishwaguru, has declared the success of providing tap water to households under the Har Ghar Nal Yojna, Tribal families in parts of Balaghat still depend on river water for drinking, putting their health at risk.

The situation in education is equally disturbing. In several villages, schools are in conditions worse than animal shelters. In one Balaghat village, around 75 children, from Anganwadi to Class 5, study in a single classroom. Despite repeated requests from the local Tribal community, we have failed to provide them with a proper school building.

Today, I hang my head in shame that even after nearly 21 years of BJP governments in Madhya Pradesh since 2003, we have not been able to guarantee many Tribal families the basic dignity of safe drinking water, adequate healthcare and quality education.

Some figures further expose the failures of my government towards Tribal communities:

- 55,795 tribal households in Madhya Pradesh remain without electricity, according to our own government's data.
- 32% of India's crimes against Scheduled Tribes were recorded in Madhya Pradesh, according to NCRB data.
- More than 5.41 lakh children (8.60%) in the state were classified as underweight.
- Over 1.36 lakh children were registered as malnourished, according to data tabled by our government in the Vidhan Sabha, with tribal communities among those severely affected.

I have failed the Tribals of not just Balaghat but entire state, and after the loss of so many innocent children, I do not believe I have the moral right to continue in this office.

I therefore tender my resignation as the Chief Minister of Madhya Pradesh with immediate effect.

Finally, I would like to express my gratitude to the Hon'ble Prime Minister, Shri Narendra Modi ji, aka Vishwaguru, for giving me the opportunity to serve the people of Madhya Pradesh.

Yours sincerely,
Abhijeet Dipke



ఆశ్చర్యపోయామని, దీప్కే పర్యటనకు ఆటంకం కలిగించడానికి వారిని ఎవరైనా పంపారేమో అని స్థానిక పాత్రికేయులు అనుమానం వ్యక్తం చేశారు.

ఆ ప్రాంతంలో 30 మందికి పైగా చిన్నారులు మరణించిన ఘటనపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. పిల్లలకు సరైన చికిత్స అందడం లేదని, 50 పడకల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో సుమారు 400 మంది పిల్లలకు చికిత్స అందిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరుపుతున్న సందర్భంగా, హైకోర్టు రాష్ట్ర ఆరోగ్య శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, బాలాఘాట్ కలెక్టర్, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. ఆ ప్రాంతంలో విపరీతమైన మురికి ఉందని, ఈ పరిస్థితుల వల్ల అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయని, వ్యాధుల కారణంగా పిల్లలు చనిపోతూనే ఉన్నారని కోర్టు సమర్పించిన నివేదికలో పిటిషనర్ పేర్కొన్నారు.

సాగర్ జిల్లాలోని బండా ప్రాంతంలో కల్తీ మద్యం సేవించడం వల్ల పలువురు అస్వస్థతకు గురైన ఘటన చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోగా, ఇప్పటివరకు ఈ కేసులో 19 మంది నిందితులను అరెస్టు చేశారు.

# 'క్లాక్'.. 'క్లిక్'.. కిక్కు

**2,500కుపైగా గడియారాలతో చెన్నై నుంగంబాక్కంలో రాబర్ట్ కెన్నెడీ ఇల్లు అలరారుతోంది. ప్రపంచంలోనే అతిచిన్న పెండులమ్ గడియారం ఇక్కడ దర్శనమిస్తోంది. 1860లో స్విట్జర్లాండ్‌లో తయారుచేసిన ఈ వాచీని కెన్నెడీ రూ.70కి కొన్నారు. 290 ఏళ్ల పురాతన పెండ్యులమ్ గడియారమూ ఆయన ఇంట్లో భద్రంగా ఉంది. తన సేకరణలో 90% విదేశీ వాచీలేనని, అవన్నీ భారతదేశంలో పాత సామగ్రి వారి నుంచి కొన్నవేనని కెన్నెడీ చెబుతారు. ఆయనలా గడియారాలు సేకరించినవారు ప్రపంచంలోనే లేరని గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు 2023లో ధ్రువీకరించారు. 'గడియారాలతో పాటు పురాతన ఫిల్మ్ కెమెరాలు, లాంతర్లు, బైనాక్యులర్లు లాంటివి 3వేల వరకు ఉన్నాయి. ఇంతటి విలువైన సంపదను ప్రజలు చూడాలంటే ప్రభుత్వం ప్రత్యేక ప్రదర్శనశాలను ఏర్పాటు చేయాలి' అని కెన్నెడీ కోరుతున్నారు.**







## అబ్బాస్‌ఖాన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా గణేశ్ మండపం



వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో ముంబయిలోని కామాఠీపురా ప్రాంతంలో గల పీపీ మార్గచా రాజా గణేశ్ మండల్‌కు 63 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మండల్‌కు గత పదిహేడేళ్లుగా ముస్లిం సామాజికవర్గానికి చెందిన అబ్బాస్‌ఖాన్ అధ్యక్షుడిగా కొనసాగుతుండటం విశేషం. హిందూ ముస్లిం తేడా లేకుండా అందరూ భారతీయుల్లా ఒక్కటై ఈ పండుగను వేడుకగా జరుపుకోవడం చాలాకాలంగా కొనసాగుతున్నట్లు వాలంటీరు వికాస్ బేల్దార్ తెలిపారు. ''గణపతి బప్పాపై మాకున్న అపారమైన విశ్వాసంతోనే ఏటా ఈ వేడుకలు నిర్వహించగలుగుతున్నాం. ఇది రెండు మతాల సామరస్య సందేశం మాత్రమే కాదు. నిజానికి మేమంతా ప్రేమ సందేశం చాటుతున్నాం. ముస్లిం ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయకుడిని ఆహ్వానిస్తాం'' అని అబ్బాస్‌ఖాన్ తెలిపారు. ఈ ఉత్సవాలు జరిగే పది రోజులూ తాము శాకాహారం భుజిస్తూ షీరా (రవ్వ కేసరి), చనా (శనగలు) ప్రసాదాన్ని ఇంటి వద్దే సిద్ధం చేసి మండపానికి తీసుకువస్తామని అబ్బాస్ భార్య హసీనాఖాన్ చెప్పారు.

## వినాయక ప్రసాదం వ్యర్థాలతో ఆస్పత్రులకు విద్యుత్తు



భారీగా జరిగే గణేశ్ ఉత్సవాలకు పేరొందిన ముంబయి మహా నగరంలో ఈ ఏడాది వినాయక చవితిని సామాజిక ప్రయోజనంతో ముడిపెట్టనున్నారు. ప్రసిద్ధ లాల్‌బాగ్‌చా రాజా మండపంలో భక్తులకు పంపిణీ చేసే ప్రసాదం, ఆహారం నుంచి వచ్చే తడి వ్యర్థాలతో విద్యుత్తును ఉత్పత్తి చేసి ముంబయిలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వినియోగించనున్నారు. ముంబయి మహానగర పాలక సంస్థ (బీఎంసీ) చేపట్టిన 'ప్రసాద్ టు ఎనర్జీ' కార్యక్రమంలో భాగంగా సుమారు 80 మెట్రిక్ టన్నుల ఆహార వ్యర్థాలను బయోమెథనేషన్ ప్లాంట్లకు తరలించనున్నారు. వీటి ద్వారా 7,700 యూనిట్లకు పైగా విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అధికారుల అంచనా. సోమవారం నుంచి 11 రోజులపాటు జరిగే గణేశ్ ఉత్సవాల్లో లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండల్ నుంచి రోజుకు 8 నుంచి 10 మెట్రిక్ టన్నుల ఆహార, సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి కావచ్చని బీఎంసీ తెలిపింది. ఈ వ్యర్థాలను అక్కడే వేరు చేసి.. ప్రత్యేక వాహనాల్లో నాయర్, కస్తూర్బా, జీటీబీ, సియాన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని బయోమెథనేషన్ కేంద్రాలకు తరలిస్తారు. ఈ కేంద్రాల్లో ఉత్పత్తయ్యే విద్యుత్తును ఆయా ఆస్పత్రులకు వినియోగిస్తారు.

## ఉత్తరాఖండ్‌లో టెస్ట్‌ట్యూబ్ బద్రి దూడ జననం



ఉత్తరాఖండ్ పర్వత ప్రాంతాలలో తిరిగే బద్రి పశు జాతిని సంరక్షించడంలో భారత వ్యవసాయ పరిశోధన సంస్థజాతీయ పాడి పరిశోధన సంస్థలకు చెందిన శాస్త్రజ్ఞులు కీలక ముందడుగు వేశారు. కృత్రిమ గర్భధారణ (టెస్ట్‌ట్యూబ్ బేబీ) పద్ధతిని ఉపయోగించి ఆరోగ్యకరమైన ఆడ దూడను ఉత్పత్తి చేశారని శనివారం వ్యవసాయ శాఖ తెలిపింది. చిన్నగా, దృఢంగా ఉండే బద్రి పశువుకు ఉత్తరాఖండ్ రాష్ట్ర జంతువుగా గుర్తింపునిచ్చారు. భారతదేశం అంతటా సంకరజాతి పశువులు పెరుగుతుండగా దేశవాళీ ఆలమందలు తరిగిపోతున్నాయి. దీంతో కృత్రిమ గర్భధారణ పద్ధతిలో బద్రి పశుసంతతి వృద్ధి ప్రాజెక్టును 2023లో చేపట్టారు. ఎంపిక చేసిన బద్రి దాత ఆవుల నుంచి శాస్త్రవేత్తలు అల్ట్రాసౌండ్‌గైడెడ్ వెలికితీత పద్ధతిలో అండ కణాలను సేకరించారు. తర్వాత వాటిని ఒక బద్రి కోడె గిత్త వీర్యంతో ప్రయోగశాలలో ఫలదీకరణం చేశారు. ఫలితంగా ఏర్పడిన పిండాలను సరోగేట్ (అద్దె గర్భం) ఆవుల్లోకి ప్రవేశపెట్టారు. సాహివాల్ జాతి ఆవులను సరోగేట్ ఆవులుగా ఉపయోగించారు. సెప్టెంబరు 11న బద్రి జాతి దూడ జన్మించింది. మరో ఐదు నుంచి ఏడు రోజులలోపు మరో బద్రి దూడకు రెండో సరోగేట్ ఆవు జన్మనిస్తుందని వ్యవసాయ శాఖ తెలిపింది. అధిక దిగుబడినిచ్చే బద్రి ఆవులను క్లోన్ చేయడంపై కూడా పరిశోధకులు పనిచేస్తున్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం
14.09.2026




# 'విశ్వగురు' ఏమి సాధిస్తుంది?

'నేనూ అమెరికాలో దక్షిణాదికి చెందినవాడినే, మీరూ ఇండియాలో దక్షిణాదికి చెందినవారే' అని 1994లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ అప్పటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దేశంలో ఉధృత ఆర్థిక సంస్కరణలను ప్రారంభించి అమెరికన్ కార్పొరేట్ శక్తుల దృష్టి భారత్ పైకి మళ్లించేలా చేసిన తర్వాత జరిగిన సంభాషణ ఇది. ఆ తర్వాత నరసింహారావు స్వయంగా అమెరికా వెళ్లి క్లింటన్‌తో విస్తృత చర్చలు జరిపారు. భారత్‌ను అమెరికా దేనిగురించైనా ఒత్తిడి చేసిందా అన్న అర్థంలో విలేఖరులు అని పీవీని అడిగారు. అప్పుడు ఆయన తన చేయిని చూపించి 'చెక్కుచెదరకుండా ఉన్నది. మీ అధ్యక్షుడు కనీసం తాకను కూడా లేదు..' అని జవాబిచ్చారు. 'మీరు ఆ మాట అన్నందుకు మీకు ఎంతో కృతజ్ఞుడిని ప్రధాని గారూ' అని క్లింటన్ వెంటనే వ్యాఖ్యానించారు. భారత్–అమెరికా మైత్రిలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించిన పీవీ, ఆ అగ్రరాజ్యంతో సంబంధాలను పెట్టుబడులు, టెక్నాలజీకే పరిమితం చేస్తూనే రష్యా, చైనా, ఇరాన్, అరబ్ దేశాలతో సంబంధాలను పటిష్ఠం చేశారు. వ్యూహాత్మక స్వతంత్రత, బహుళ దిశలతో కూడిన దౌత్యనీతిని అవలంబించిన పీవీ భారత క్షిపణి కార్యక్రమానికి, అణ్వస్త్ర పరీక్షలకు రంగం సిద్ధం చేస్తూనే వచ్చారు. ఆయన తర్వాత ప్రధానమంత్రి అయిన వాజపేయి... అమెరికా ఆంక్షలకు వెరవకుండా అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించారు. చివరకు అమెరికాయే భారత్‌కు మళ్లీ స్నేహహస్తం చాచే పరిస్థితులు కల్పించారు. క్లింటన్ భారత్‌లో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు ఒకరు 22 సంవత్సరాల తర్వాత భారత్‌లో పర్యటించడం అదే మొదటిసారి.

ఈ పరిణామాలు ఏమి నిరూపించాయి? ప్రపంచ రాజకీయాల్లో భారత్‌ను ఎవరూ శాసించలేరని, ఎవరైనా శాసించే పరిస్థితులు వస్తే భారత్ తన మార్గం తాను అవలంబిస్తుందని స్పష్టం చేస్తున్నాయి. 'భారతదేశానికి సహజసిద్ధంగా అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలిగే శక్తి ఉన్నది. ఇండియా చరిత్ర, నాగరికత, భౌగోళిక పరిస్థితులే అందుకు కారణం' అని మన తొలి ప్రధాని పండిట్ నెహ్రూ 1949లోనే ప్రకటించారు. అయితే ఇవాళ అంతర్జాతీయ దౌత్యంలో ఒక పరిణామాత్మక సంక్షోభాన్ని మనం ఎదుర్కొంటున్నాం.

అమెరికా, సోవియట్ ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా భారతదేశం అలీనోద్యమాన్ని ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా వ్యవస్థీకృతం చేసింది. ఆ తర్వాత అనేక కీలక అంతర్జాతీయ వ్యవస్థల రూపకల్పనలో ప్రముఖ స్థానం పోషించింది. 2009లో ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా దేశాలతో బ్రిక్స్ ఆవిర్భావంలోనూ భారత్ కీలకపాత్ర పోషించడం ఆ సముజ్వల చరిత్ర కొనసాగింపే అనడం సత్యదూరం కాదు. 'మనం ఎన్నో రకాల సవాళ్లు ఎదుర్కొంటున్నాం. ఈ పరిస్థితుల్లో కలిసికట్టుగా కార్యాచరణ చేపట్టాల్సిన అర్థవంతమైన అవకాశం మనకు లభించింది' అని మన్మోహన్‌సింగ్ 2013లో దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రకటించినప్పుడు వినే అవకాశం నాకు లభించింది. అదే ఏడాది బీజింగ్ పొలిమేరల్లో చైనా ప్రభుత్వం తమ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ పార్టీ స్కూలు సభ్యులకు మన్మోహన్ సింగ్ ద్వారా పాఠాలు చెప్పించిన అపురూప కార్యక్రమంలో కూడా నేను పాల్గొన్నాను. చైనా భావి నాయకులను తయారు చేసే ఆ పాఠశాలలో ఒక విదేశీ ప్రభుత్వాధినేతతో పాఠాలు చెప్పించడం ఒక అరుదైన ఘట్టం.

ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ షరతుల నేపథ్యంలో బ్రిక్స్ ఆధ్వర్యంలో 2012లో జరిగిన సదస్సులో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కూడా మన్మోహన్ సింగ్‌దే. ఏ షరతులూ లేకుండా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారత్‌లో మెట్రో, ఆర్ఆర్‌టీఎస్, గ్రామీణనీటి పారిశుధ్యం వంటి అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులు లభిస్తూనే ఉన్నాయి.

న్యూఢిల్లీలో సెప్టెంబర్ 11 నుంచి 14 తేదీల మధ్య జరుగుతున్న బ్రిక్స్ సమావేశాలు ఈ నేపథ్యంలోనే మనం అర్థం చేసుకోవల్సి ఉన్నది. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత పీవీ, మన్మోహన్‌సింగ్ హయాంలో నెలకొల్పిన బహుళ సంబంధాల దిశకు భిన్నంగా అమెరికాను అధికంగా ఆలింగనం చేసుకున్నారనే విమర్శలు వచ్చినప్పటికీ ఇవాళ భారత్ తన అడుగులను సరిదిద్దుకోవాల్సిన అవసరాన్ని గ్రహించినట్లు కనపడుతోంది. బ్రిక్స్ ఇప్పుడు ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఈజిప్టుతో సహా 11 దేశాలకు విస్తరించింది. మరో 10 దేశాలను భాగస్వామ్య దేశాలుగా చేర్చుకున్నారు. ప్రపంచంలో 50శాతానికి పైగా జనాభాకు ఈ కూటమి ప్రాతినిధ్యం వహిస్తోంది. గ్లోబల్ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా ఇంచుమించు 40శాతంగా ఉన్నది. ఇరాన్‌పై దాడి, అన్ని దేశాలపై ఎడాపెడా టారిఫ్‌లు, అమెరికా ఫస్ట్ పేరుతో విపరీత విధానాల ద్వారా ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల ఆర్థిక ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లకల్లోలం చేస్తున్న పరిస్థితుల్లో బ్రిక్స్ ఒక బలమైన వ్యవస్థగా ప్రభవిస్తుందనడంలో సందేహం లేదు. ఇవాళ అమెరికా ధోరణిని పొరుగు కెనడాతో పాటు సుదూర ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా ప్రతిఘటిస్తున్నాయి.

ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమావేశాలకు భూమికగానే గత నెలాఖరులో కిర్గిస్థాన్‌లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు జరిగింది. నిజానికి 2023లో ఢిల్లీలో ఎస్‌సీఓ సదస్సు జరగాల్సి ఉండగా, అమెరికాతో ఘర్షణ పడే పరిస్థితుల్లో భారత్ లేకపోవడంతో వ్యూహాత్మకంగా ఆన్‌లైన్ సమావేశం జరపాల్సి వచ్చింది. అయితే తాజా సమావేశంలో ఇరాన్ భూభాగంపై జరిగిన సైనిక దాడులను ఖండిస్తూ, పశ్చిమాసియా స్థిరత్వాన్ని సమర్థిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడంలో భారత్ చొరవ చూపడం అత్యంత కీలక పరిణామమని చెప్పక తప్పదు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకూ సమాన ప్రాతినిధ్యం ఉండాలని, అభివృద్ధి చెందిన దేశాలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, ఆర్థిక స్వావలంబనతో పాటు బహుళ ధ్రువ వ్యవస్థ ఏర్పడాలని భారత్ ప్రతిపాదించడం విస్మరించదగిన విషయం కాదు.

బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో రష్యా, చైనాలతో పాటు ఇతర దేశాలను భారత్ ఎంత మేరకు ప్రభావితం చేయగలదో చూడాల్సి ఉన్నది. వెస్ట్‌కు వ్యతిరేకం కాకుండా అదే సమయంలో వెస్ట్ మాత్రమే ప్రపంచ దేశాలను శాసించకుండా ఉండాలనే తన వైఖరిపై చైనా, రష్యాలను బ్రిక్స్ సమావేశంలో భారత్ ఒప్పించడమంటే కత్తిమీద సాము చేయడం వంటిది. అమెరికా డాలర్‌కు పోటీగా బ్రిక్స్ కరెన్సీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కూడా భారత్ అంగీకరించే పరిస్థితుల్లో లేదు. ఇప్పటికే స్థానిక కరెన్సీల ద్వారా బ్రిక్స్ దేశాల్లో వాణిజ్యం జరుగుతున్న రీత్యా యూపీఐ వంటి వ్యవస్థల అనుసంధానం ద్వారా దేశాల మధ్య వేగవంతమైన డిజిటల్ చెల్లింపులను ప్రవేశపెట్టాలని భారత్ ప్రతిపాదిస్తోంది. డాలర్ పెత్తనాన్ని బలంగా ఎదుర్కోగలిగిన పరిస్థితులూ, అవసరమూ లేదని మనదేశం భావిస్తోంది. భారత్ యథా ప్రకారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోను, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లోనూ సంస్కరణలను కోరుతోంది. వీటిపై ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉన్నది.

అన్నిటికన్నా భారత్‌కు ముఖ్యమైనది చైనా ఆధిపత్యాన్ని సమతుల్యం చేయడం. బ్రిక్స్ పూర్తిగా చైనా ప్రభావంలోకి వెళ్లకుండా భారత్ వీలైనంత మేరకు ప్రయత్నాలు చేస్తుందనడంలో సందేహంలేదు. అంతేకాక బ్రిక్స్ వేదికపై చైనాతో ఏర్పడే సంబంధాల ద్వారా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించి, ప్రశాంత పరిస్థితులను కల్పించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే చైనా సైనిక అధికారులతో భారత సైనికాధికారులు సరిహద్దుల్లో చర్చలు జరపడం ఇందుకు నిదర్శనం. బ్రిక్స్‌లో ఇరాన్, యూఏఈ వంటి దేశాల భాగస్వామ్యం మూలంగా భారత్‌కు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. చమురు, ఇంధన భద్రత, సముద్ర వాణిజ్య మార్గాలు, గల్ఫ్ దేశాలతో ఆర్థిక సంబంధాలు పటిష్ఠం చేసుకునే అవకాశం లభిస్తుంది. అంతేగాక బ్రిక్స్ మూలంగా లిథియం, రేర్ ఎర్త్, నికెల్ వంటి కీలక ఖనిజ వనరులపై పరస్పర సహకారం లభించే అవకాశాలు ఉన్నాయి.

# ట్రంప్‌కు ఎదురుగాలి!

**రెండో దఫా అధికార పీఠం అధిరోహించి కూడా రెండేళ్లు కావస్తున్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు దౌత్యనీతి ఒంటబట్టలేదు. తాను నిర్దేశించినదాన్ని అంగీకరించటమే తప్ప మరోవిధంగా మాట్లాడే హక్కు, అధికారం ఏ దేశానికీ లేదని ఆయన ఇప్పటికీ నమ్ముతున్నారు. ఆయన దృష్టిలో కేవలం అదే దౌత్యం. భారత్ నుంచి కెనడా వరకూ... ఇరాన్ నుంచి వెనిజులా వరకూ ఆయనది ఇదే బాణీ. ట్రంప్‌ను నేరుగా ప్రతిఘటించే వారుండొచ్చు, పరోక్షంగా చెప్పిచూద్దామనుకునే వారుండొచ్చు... మార్గాలు వేరైనా ట్రంప్ షరతులకు తలొగ్గబోమని చెప్పడమే వీరందరి సారాంశం. చాన్నాళ్లుగా విసుగెత్తి ఉన్నారేమో... కెనడా ప్రధాని మార్క్ కెర్నీ చాలా కరకుగానే వ్యవహరించారు. ఒకదాని వెంబడి మరో గొంతెమ్మ కోర్కెతో చీకాకుపరుస్తున్న అమెరికా తీరును నిరసిస్తూ వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కురావాలని ఆదేశించారు. ఒప్పందం దాదాపు ఖరారై సంతకాలు జరపడమే తరువాయి అనుకునే దశలో ఎదురైన ఈ ఊహించని పరిణామం అమెరికాను అయోమయంలోకి నెట్టింది. ఇలాంటి**



**భంగపాట్లే ఇరాన్ దగ్గర ఎదురయ్యాయి. మన దేశంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని అమెరికా అనేకమార్లు ప్రకటించింది. కానీ అదేమీ జరగలేదు.**

వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తన సైన్య బలంతో ఈ ఏడాది మొదట్లో అపహరించి, అమెరికాలో ఆయనపై విచారణ తంతు సాగిస్తున్నారు. ఇకపై అది తమ భూభాగమని అమెరికా చెప్పడం ఆ దేశ ప్రజల్ని మాత్రమే కాదు... అత్యధిక దేశాలను ఆగ్రహోదగ్రుల్ని చేస్తోంది. ఇక ఇరాన్ సంగతి చెప్పనవసరం లేదు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపేశామని చెప్పటం నుంచి హోర్మూజ్ తమదేనని ప్రకటించటం వరకూ ట్రంప్ ఎన్ని చేసినా ఇరాన్ నిబ్బరంగా 'నీ లెక్కమిట'న్నట్టే వ్యవహరిస్తోంది.

మిత్ర దేశమైన దక్షిణ కొరియాదీ అదే వైఖరి. ఏటా 11 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుపుతాయి. ఈసారి అయిదో రోజుకల్లా అమెరికా సైనికులు తట్టా బుట్టా సర్దుకుని తిరుగుముఖం పట్టారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో చెలిమి కోసం ట్రంప్ తహతహలాడటంపై ఆగ్రహించి దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఈ విన్యాసాల ఉద్దేశం ఉత్తర కొరియాను భయపెట్టడం. తీరా ఆ దేశంతోనే అమెరికా చేతులు కలుపుతుంటే... ఈ విన్యాసాలకు అర్థమేమిటన్నది దక్షిణ కొరియా ప్రశ్న. వాస్తవానికి ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వస్త్ర దేశంగా మారింది. ఆ దేశం దగ్గర 'చాలా శక్తిమంతమైన' ఆయుధా లున్నాయని ట్రంపే కొద్దికాలం క్రితం ప్రకటించారు. దాన్ని మరిచి కొత్త చుట్టరికాలు కలుపుకుందామని ట్రంప్ ప్రయత్నించినంత మాత్రాన ఆ దేశం నమ్మే అవకాశమేమీ లేదు.

ఇరాన్‌తోసహా అన్ని దేశాలతోనూ దౌత్యపరంగా వరస వైఫల్యాలు తప్పడం లేదు గనుక ఉత్తర కొరియాకు దగ్గరై అమెరికా జనాన్ని ఆశ్చర్యపరచాలని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ వేరే దేశాలతో పెంచుకున్న వైరం వికటిస్తున్న విధంగానే ఉత్తర కొరియాతో చెలిమి సైతం బెడిసికొట్టే అవకాశం లేకపోలేదు. చివరకు ఉత్తర కొరియాఏం చేస్తుందన్నది అలావుంచితే... ఆసియా-పసిఫిక్ దేశాలన్నిటా ట్రంప్ అంతరంగంపై ఇప్పటికే ఉన్న సందేహాల్ని మరింతగా పెంచింది. ఈ దేశాలన్నీ చైనా దూకుడువల్ల చాలా ఇబ్బంది పడుతున్నాయి. ఇలాంటి సమయంలో తమకు అండగా నిలిచి, చైనాకు కళ్లెం వేయాల్సిన అమెరికా ఆడుతున్న వింతనాటకాలు వాటికి మింగుడుపడటం లేదు.

అందుకే దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల సాన్నిహిత్యమవుతున్నాయి. ఆ రెండింటిమధ్యా ఇబ్బందికర చరిత్రవున్నా ట్రంప్ వింత చేష్టలు వారిని సన్నిహితం చేశాయి. కెనడా ఉత్పత్తులపై 50 శాతం అదనపు సుంకాలు వేయాల్సివస్తుందని ట్రంప్ ప్రకటించగా, దానికి ప్రతిగా వచ్చే నెల 8 నుంచి అమెరికా ఉత్పత్తులపై 15 నుంచి 50 శాతం వరకూ సుంకాలు విధిస్తామని కెర్నీ ప్రకటించారు. అమెరికా అదనపు సుంకాల విలువ 2,000 కోట్ల డాలర్లయితే, కెనడా సుంకాలు 2,760 కోట్ల డాలర్లు. ఈ ప్రపంచం తనకు భయపడటం మాట అటుంచి... జాలి కూడా చూపబోదని ట్రంప్‌కు ఎంత త్వరగా తెలిస్తే అమెరికా ప్రజలకు అంత మేలు.

# 'తెలుగు తక్కువ' తరానికి దారేది?

**ఏడాదికి రెండుసార్లు.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఆర్నెల్లకోసారి మనకు తెలుగు భాష గుర్తొస్తుంది. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం, ఇంకో ఆర్నెల్లకు ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా భాష గురించి మాట్లాడుకుంటాం. తెలంగాణ ఏర్పడిన తరువాత సెప్టెంబర్ 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. ఏమైనా, భాష గురించి ఈ రోజుల్లో చర్చించుకోవటానికైనా ఈ 'దినోత్సవాలు' పనికొస్తున్నాయి. తెలుగు భాషకు ఇంగ్లీష్ వల్ల పెనుప్రమాదం వచ్చిందని ఈ సందర్భంగా ఉపన్యాసాలు ఇవ్వటం, అందులో మీడియా భాష మీద నాలుగు రాళ్ళేసి వెళ్ళటం క్రమం తప్పకుండా జరుగుతోంది.వాడుక భాషలో ఇంగ్లీష్ మాటలు ఎక్కువగా వస్తున్నాయనే విమర్శ ఉన్నమాట నిజం. ఇంగ్లీష్ మీడియం చదువులు ఒకవైపు, మీడియాలో అనవసరపు ఇంగ్లీష్ మాటల వాడకం ఇంకోవైపు ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తూ వస్తున్నాయి. అయితే, సంస్కృతం వాడకం సంగతేంటి? 'జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు' అనే మాట నిజమే అయినా, ఇంకా ఎంత కాలం అదే సంస్కృతంతో తెలుగుకి దూరమవుదాం? 'వాడుక భాష' అనకుండా 'వ్యావహారిక భాష' అనటంలోనే మనకున్న సంస్కృత ప్రేమ అర్థమవుతోంది. ఏదైనా ఒక ఇంగ్లీష్ మాట వస్తే దాన్ని తెలుగులో చెప్పాలనుకున్నప్పుడు మనం సంస్కృతాన్ని ఆశ్రయిస్తున్నాం.**




మీడియాలో ఇప్పటికీ అదే జరుగుతోంది. మొబైల్ ఫోన్‌ను చరవాణి అని, ఇంటర్నెట్‌ను అంతర్జాలం అని రాస్తున్నాయి. కేవలం ఇంగ్లీష్ వాడకూడదనే అభిప్రాయంతోనే ఇలాంటి అనువాదాలకు దిగుతున్నట్టు ఉంది తప్ప సామాన్యులకు అర్థం కావాలన్న అభిప్రాయం ఉన్నట్టు కనబడడం లేదు. పైగా, ఎక్కువమంది మెచ్చి ఆహ్వానించి వాడటం మొదలుపెట్టినప్పుడే ఇలాంటి మాటలకు సార్వజనీనత వస్తుంది. ఔటర్ రింగ్ రోడ్‌ను బాహ్య వలయ రహదారి అని అనువదించటం వల్ల ఒరిగేదేమీలేదు. ఇంకా వీలైతే 'చుట్టుదారి' లాంటి మాట అయితే జనం అర్థం చేసుకుంటారు.

సామాన్య జనం 'ఇళ్ళు కడతారు'. మీడియా వాళ్ళు మాత్రం 'గృహాలు నిర్మిస్తారు'. జనం కొత్త బట్టలు వేసుకుంటారు. కానీ మీడియా రాతల్లో మాత్రం 'నూతన వస్త్రాలు ధరిస్తారు'. అసలు ఏ మాత్రమూ ఆలోచించకుండానే మీడియాలో చాలా సందర్భాలలో 'నూతన' అని వాడుతున్నారు తప్ప జనం మాటల్లో వాడే 'కొత్త' జోలికి పోవటం లేదు. 'అనంతరం' బాగుంటుంది గాని తరువాత నచ్చదెందుకో? జనం 'ఒప్పుకుంటారు' గాని మీడియా వాళ్ళు మాత్రం 'అంగీకరిస్తారు'. 'పుట్టారు' బదులు 'జన్మించారు' అంటారు. 'వాడకం' బదులు వినియోగం అంటేనే తృప్తిగా ఉంటోంది.

కోప్పడ్డారు' బదులు 'ఆగ్రహించారు' అని వాడాల్సిన అవసరం ఏమొచ్చింది? గెలిచారు అనటానికి బదులు విజయం సాధించారు అని, అమ్మకం బదులు విక్రయం అని, ఓడినవాళ్లను పరాజితులు అని, 'మెచ్చుకున్నారు' బదులు 'అభినందించారు' అని, ఎగతాళి బదులు అపహాస్యం అని, పుకార్లు బదులు వదంతులు అని రాయటం, చెప్పటం నిజం కాదా? మనం రాసేటప్పుడు ఆ మాట సామాన్య జనం వాడుతున్నదా, కాదా అనేది ఒక్క క్షణమైనా ఆలోచిస్తున్నామా?

తరచూ తెలుగుభాష గురించి ఆవేదన వెళ్లగక్కే ఒక ఆచార్యులవారు ఈ మధ్యనే తన అనుభవాన్ని పంచుకున్నారు. చాలా పెద్ద చికిత్సాలయానికి వెళ్ళి 'దంత వైద్యునితో కలిసేది ఉంది' అని అక్కడున్న మహిళతో అంటే ఆమె ఏగాదిగా చూసిందట. 'డెంటిస్ట్ అపాయింట్‌మెంట్ ఉంది' అన్నప్పుడు ఆమెకు అర్థమైందట. ఈ పరిస్థితికి తెలుగు వాళ్ళందరినీ సిగ్గుపడవలసిందిగా కోరతున్నారాయన. దంత వైద్యుడనే సంస్కృతం జోలికి పోకుండా, దుష్టసమాసమంటూ చాదస్తానికి పోకుండా 'పళ్ల డాక్టర్' అని అడిగి ఉంటే సరిపోయేది. జనం నోళ్లలో నానే 'బడి'ని 'పాఠశాల' చేసి అదే రుద్దాలని చూడటం వల్ల చివరికి 'స్కూలు' స్థిరపడిపోయింది. 'పై చదువులకు' అని జనం మాట్లాడుకుంటూ ఉంటే మీడియా మాత్రం 'ఉన్నత విద్యాభ్యాసం కోసం' నుంచి దిగిరాలేదు. ఈలోగా 'హయ్యర్ స్టడీస్' అని మాట్లాడే తరం వచ్చేసింది. అతిగా ఇంగ్లీష్ వాడవద్దని చెప్పాలి తప్ప చీటికి మాటికి సంస్కృతాన్ని ఆశ్రయించటం తగ్గించుకోమని ఎవరైనా చెప్పినా సంస్కృత ప్రేమికులకు కోపమొస్తుంది. వందల ఏళ్లనాటి పరాయిభాష కంటే వేల ఏళ్ల నాటి మన సంస్కృతం మెరుగు అనేది వీళ్ళ సమాధానం.

ఒకప్పటి గ్రాంథికం నుంచి ఇప్పుడున్న స్థాయికి రావటానికి అవిశ్రాంత పోరాటం జరిపి, వ్యావహారిక భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళినవాడు గిడుగు రామమూర్తి. కొంతమంది పండితులు ఆయన వాదనతో ఏకీభవించి సరళ గ్రాంథికంలో రచనలు మొదలుపెట్టారు. ఆ తరువాత పత్రికలు కూడా అదే బాట పట్టాయి. తాపీ ధర్మారావు లాంటివాళ్లు చొరవ తీసుకున్నారు. శిష్టవ్యావహారికంలో రాయటం మొదలుపెట్టారు. 'వారు పరమపదంబు జెందె' నుంచి 'వారు పరమపదించారు' దాకా తీసుకురాగలిగారు. ఆ తరువాత తరాల్లో మరింత సరళమై 'వారు చనిపోయారు' దాకా రావటం చూస్తున్నాం.

గిడుగు తరువాత కూడా వ్యావహారిక భాష మీద మరింత ఆలోచన జరిగింది. 1970లలో కూడా యూనివర్సిటీల పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే ఉండటం మీద చర్చ మొదలైంది. ప్రభుత్వ కార్యకలాపాలు, యూనివర్సిటీ పరీక్షలు, పరిశోధనాపత్రాలు శిష్టవ్యావహారికంలో అనుమతించాలంటూ 1971లో ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానం ఒక చరిత్రాత్మక ఘట్టం. దీనిమీద 11 మందితో ఏర్పాటైన కమిటీ ఐదు సమావేశాలు జరిపింది. ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల పరిధిలోని ఎనిమిది మంది, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ఏడుగురు సాహిత్య, పాత్రికేయ ప్రముఖుల అభిప్రాయాలు సేకరించారు. ఆ విధంగా రూపొందించి ఇచ్చిన నివేదిక ఆధారంగా శిష్టవ్యావహారానికి ఆమోద ముద్ర పడి యాభై ఏళ్ళు గడిచాయి. ఈ యాభై ఏళ్ళలో భాష వాడకంలో చాలా మార్పులొచ్చాయి. రచనల్లో, విద్యారంగంలో, మీడియాలో వచ్చిన మార్పులు చాలా ఉన్నాయి. అయితే, ఈ మార్పులు ఏ దిశగా వెళుతున్నాయన్నదే భాషా ప్రేమికుల ఆందోళన. తప్పులు ఎంచుకుంటూ బాధపడటం కంటే, ప్రవాహశీలమైన భాషను క్రమబద్ధం చేసి దిశానిర్దేశం చేయాలన్న ఆలోచన కూడా కొంతమంది మాటల్లో బైటపడుతోంది. ఇది వ్యక్తులతో వీలయ్యే పనికాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు అకాడెమీలు, తెలుగు విశ్వవిద్యాలయాలు, అధికార భాషా సంఘాలు, మీడియా అకాడెమీలు ఉన్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ సంస్థల సారథ్యంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలుగు భాష వాడకం తీరుతెన్నులను సమీక్షించి ఇప్పటి 'తెలుగు తక్కువ' తరానికి మార్గదర్శనం చేసేలా సూచనలివ్వాలి.

కృత్రిమ మేధస్సు , యంత్ర అనువాదం, వాయిస్ అసిస్టెంట్లు, పాడ్‌కాస్ట్‌లు, ఓటీటీ వేదికలు, సోషల్ మీడియా, డిజిటల్ వార్తా వ్యవస్థల విస్తరణతో తెలుగు భాష వాడకం ఇంతకుముందెన్నడూ లేనంతగా పెరిగింది. అందువల్ల భవిష్యత్తులో చాలా మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. తెలుగు వాయిస్ సెర్చ్ వినియోగం పెరుగుతుంది. ఎఐ ఆధారిత వార్తా రచన అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ నిఘంటువులు మరింతగా అందుబాటులోకి వస్తాయి. యూనికోడ్ వినియోగం వల్ల తెలుగు లిపి మరింత విస్తరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు కంటెంట్ వాడకం పెరుగుతుంది. మీడియాలో తెలుగు సాంకేతిక పదసంపద అభివృద్ధి చెందుతుంది. వాడుక భాషను వేగంగా జనంలోకి తీసుకువెళ్లటంలో సోషల్ మీడియా పాత్ర చెప్పుకోదగినంతగా ఉంది. అయితే, భాషా ప్రమాణాల మీద ప్రతికూల ప్రభావం కూడా చూపుతోంది. అందుకే అవసరమైనంత మేరకే ఇంగ్లీష్, సంస్కృతం వాడేట్టు చూడటం ద్వారా తెలుగును కాపాడుకోవాలి. ఆధునిక తెలుగు వాడకం కోసం ఒక శైలీపత్రం తయారు చేయాలి.

విశ్వవిద్యాలయాల స్థాయిలో శిష్టవ్యావహారానికి ఆమోద ముద్రపడి యాభై ఏళ్ళు పూర్తయిన సందర్భంలోనైనా తెలుగుభాషా దినోత్సవం ఒక రోజుకే పరిమితం కాకూడదని, భాషను కాపాడుకోవటం గురించి పాలకులు సానుకూలంగా దృష్టిపెట్టాలని కోరుకుందాం.

# బాకీల వసూలు ఇక సులభతరం

**సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) బకాయిలే భారంగా మారుతున్నాయి. పెట్టుబడులు, ఆదాయాలు అంతగా లేని ఈ పరిశ్రమల ఉనికికే ప్రమాదకరంగా మారిన బకాయిల భారాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరిగినా ఫలితం ఉండటం లేదు. 'ఫెసిలిటేషన్ కౌన్సిల్' పేరిట ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైనా ప్రయోజనం కొరవడింది.ఈ క్రమంలో ఎంఎస్ఎంఈలకు సంబంధించిన వివాదాల పరిష్కార ప్రక్రియ మరింత వేగంగా పూర్తయ్యేందుకు, సంబంధిత చట్టానికి ప్రభుత్వం ఇటీవల ముఖ్యమైన సవరణలు చేసింది.**

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం2006 ఎంఎస్ఎంఈల పురోగతికీ, తద్వారా దేశ ఆర్థిక ప్రగతికీ దోహదం చేసే ఎన్నో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాధారణంగా వివాదాల పరిష్కారానికి, సివిల్ కోర్టులు, కమర్షియల్ కోర్టులను ఆశ్రయించాల్సి ఉంటుంది. కానీ, ఈ చట్టంలోని సెక్షన్20, వివాదాల పరిష్కారానికి కోర్టుల్లో పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఒక ప్రత్యేక వ్యవస్థగా 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'ను ఏర్పాటు చేసింది. కొనుగోలుదారులు చెల్లింపులు చేయకపోయినా, చెల్లింపుల్లో వివాదాలు తలెత్తినా బాగా సమయం పట్టే సివిల్ కోర్ట్ ప్రక్రియ కాకుండా, ఫెసిలిటేషన్ కౌన్సిల్‌లో వ్యాజ్యం దాఖలు చేయవచ్చు. ఒకవేళ మధ్యవర్తిత్వం ద్వారా వివాదం పరిష్కారం కాకపోతే, వ్యాజ్యాలను 90 రోజుల్లో పరిష్కరించాలని ఈ చట్టం నిర్దేశిస్తోంది. అయినా, దేశ వ్యాప్తంగా తొంభై వేలకుపైగా వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 21 వేల కోట్ల రూపాయలు చిక్కుకోవడంతో చెల్లింపుల కోసం ఎంఎస్ఎంఈలు ఎదురు చూస్తున్నాయి. బకాయిల్లో దాదాపు 40 శాతానికిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థల నుంచే రావాల్సి ఉంది.

**మధ్యవర్తిత్వం ద్వారా ప్రయత్నం**

దేశవ్యాప్తంగా 161 ఫెసిలిటేషన్ కౌన్సిళ్ల ఏర్పాటు జరిగింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వీటిని ఏర్పరిచాయి.తెలంగాణలో ఆరు జిల్లా కేంద్రాల్లో (కరీంనగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, హనుమకొండ, యాదాద్రిభువనగిరి, మేడ్చల్‌మల్కాజిగిరి), ఆంధ్రప్రదేశ్‌లో అయిదు (విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు, తిరుపతి, మంగళగిరి) చోట్ల కౌన్సిళ్లు ఏర్పాటయ్యాయి. 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లో ముగ్గురికి తగ్గకుండా, అయిదుగురికి మించకుండా సభ్యులుంటారు. ఎంఎస్ఎంఈ శాఖను నిర్వహించే డైరెక్టర్ దీనికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈ పరిశ్రమలకు రుణాలిచ్చే బ్యాంకుల నుంచి, న్యాయ, అకౌంటింగ్, ఆర్థిక రంగాల నిష్ణాతులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. తాజా చట్ట సవరణతో ఛైర్‌పర్సన్ కాకుండా పరిశ్రమల సంఘాల ప్రతినిధులు, న్యాయనిపుణులను మాత్రమే నియమించవచ్చు. సెక్షన్15 ప్రకారం, వస్తు కొనుగోలుదారులు, వినియోగదారులు ఎంఎస్ఎంఈలకు 45 రోజుల్లో చెల్లింపులు చేయాలి. లేకపోతే, బ్యాంకువడ్డీ శాతంగా రిజర్వ్ బ్యాంక్ నోటిఫై చేసిన రేటుకు మూడింతల చక్రవడ్డీతో పాటు చెల్లించాలి. వివాదాలుంటే, సెక్షన్18 ప్రకారం ఎంఎస్ఎంఈలు 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లో పిటిషన్ దాఖలు చేయవచ్చు. మధ్యతరహా పరిశ్రమలు మాత్రం సివిల్, కమర్షియల్ కోర్టులను ఆశ్రయించాల్సిందే. పిటిషన్ దాఖలు చేసిన తర్వాత, ఫెసిలిటేషన్ కౌన్సిల్ మొదటగా వివాదాన్ని మధ్యవర్తిత్వ చట్టం2023 ప్రకారం సామరస్య పరిష్కారానికి ప్రయత్నిస్తుంది. తాజా సవరణ ద్వారా మధ్యవర్తిత్వంతో సామరస్య పరిష్కారానికి ప్రభుత్వం 90 రోజుల గడువును నిర్దేశించింది. సామరస్య పరిష్కారం కుదరని సందర్భాల్లో, ఆర్బిట్రేషన్ కన్సిలియేషన్ చట్టం1996 ప్రకారం వివాదాన్ని పరిష్కరిస్తారు. తీర్పుపై అప్పీల్ చేయడానికి కొనుగోలుదారులు అవార్డ్‌లో 75శాతం సొమ్మును జమచేయాల్సి ఉంటుంది.న్యాయసూత్రాల ప్రకారం, అవతలి పక్షం ఉన్నచోటే వ్యాజ్యాన్ని దాఖలు చేయాలి. ఆ పద్ధతిలో కోర్టు ఖర్చులు పెరిగిపోతాయి. అందుకని, ఎంఎస్ఎంఈలకు మినహాయింపునిచ్చారు. కొనుగోలుదారులు దేశంలో ఎక్కడున్నా, పరిశ్రమలు తమ కార్యాలయ పరిధిలో ఉన్న 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లోనే వ్యాజ్యం దాఖలు చేసుకునే వెలుసుబాటు కల్పించారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం | 14.09.2026 | 01

# మలేషియా పీఎంతో రాహుల్, ప్రియాంక బ్రేక్ ఫాస్ట్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేదికగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదివారం ఉదయం ఢిల్లీలోని ఒక హోటల్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఇచ్చిన ప్రత్యేక అల్పాహార విందులో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ భేటీ సందర్భంగా భారత్‌మలేషియా సంబంధాలు, ఇరు దేశాల మధ్య దౌత్య బంధాలు, అంతర్జాతీయ/ప్రాంతీయ పరిణామాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. భేటీ అనంతరం మలేషియా ప్రధాని సామాజిక మాధ్యమం 'X' వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీని తన 'మంచి మిత్రుడు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై ఒకరి అభిప్రాయాలను మరొకరు పంచుకోవడానికి ఈ సమావేశం చక్కని వేదికైందని తెలిపారు. ఈ సమావేశానికి శనివారం, ప్రధాని నరేంద్ర మోదీతో కూడా మలేషియా ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ భేటీలో సెమీకండక్టర్లు, రక్షణ, వర్తకం, మౌలిక వసతులు, ఎనర్జీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ఒప్పందాలు కుదిరాయి. బ్రిక్స్ కూటమిలో 'పార్టనర్ కంట్రీ' (భాగస్వామ్య దేశం) గా మలేషియా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో పాటు, ఆసియాన్ ప్రాంతంలో భారత్‌కు అత్యంత కీలకమైన భాగస్వామిగా కొనసాగుతోంది.

# ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావిస్తున్న సీఎం చంద్రబాబు



**- ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం : పరిటాల శ్రీరామ్.....**
**- 87 మందికి రూ.44 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ....**
**- ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా.....**

**ధర్మవరం సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజలంతా రుణపడి ఉన్నారని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 87 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.44 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 26 నెలల్లోనే సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ప్రజలకు సహాయం అందలేదన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి ఇబ్బంది వచ్చినా ప్రభుత్వం తక్షణమే స్పందిస్తోందని శ్రీరామ్ తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నారని చెప్పారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా.....**

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త నెట్టెం కేశవ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్.. కేశవ్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో ఆయన కుటుంబానికి బీమా సాయం అందేలా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామ్ చొరవతో రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రాన్ని కేశవ్ సతీమణి నెట్టెం మహేశ్వరికి పరిటాల శ్రీరామ్ అందజేశారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచే విషయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని శ్రీరామ్ అన్నారు. కేవలం రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్న ఏకైక పార్టీగా టీడీపీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తోందన్నారు. ఇప్పటికే అనేక మంది కార్యకర్తల కుటుంబాలకు ఈ బీమా సాయం అందిందని తెలిపారు.

ప్రజల కోసం ప్రభుత్వం.. కార్యకర్తల కోసం పార్టీ.. అనే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ పనిచేస్తోందని పరిటాల శ్రీరామ్ అన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా ఉండటం ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన విషయమని, చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నందుకు తమకు ఎంతో సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలు, వార్డులకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం



**పొంగూరు షరణి**
**- నెల్లూరులో ఘనంగా ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ**
**- ఉస్మాన్ సాహెబ్ పేట శివాలయంలో పొంగూరు షరణి ప్రత్యేక పూజలు**
**- స్నేహిత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మందికి మట్టి గణపతుల పంపిణీ**
**- PoP ని నివారిద్దాం - పర్యావరణాన్ని రక్షిద్దాం : పొంగూరు షరణి పిలుపు**
**- సనాతన ధర్మం ప్రకారం మట్టి వినాయకుడి పూజే అత్యంత పవిత్రం: షరణి**

**నెల్లూరు సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నెల్లూరు ఉస్మాన్ సాహెబ్ పేటలోని శివాలయం వద్ద 10వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి తిరుమల నాయుడు వారి మిత్ర బృందం స్నేహిత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మందికి పైగా ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు ప్రజలకు వినాయక చవితి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు...అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీరు, పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతున్నాయని, మన సనాతన ధర్మం ప్రకారం అత్యంత పవిత్రమైన, శుభప్రదమైన మట్టి గణపతినే ప్రతి ఒక్కరూ ఇళ్లలో ప్రతిష్టించి పూజించాలని పిలుపునిచ్చారు. PoP ని నివారిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో స్నేహిత్ ఫౌండేషన్ ప్రతి ఏటా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ దర్గయ్య, చైర్మన్ శ్రీనివాసులు, స్నేహిత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుర్రం వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ఐతా సురేంద్ర మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సిల్క్ సిటీ... గ్రీన్ సిటీగా, కాలుష్యరహిత సిటీగా ఉండాలి





**- పట్టణ ప్రజలకు ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పిలుపు**
**- ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**
**- ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని శ్రీరామ్ విజ్ఞప్తి**

**ధర్మవరం సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

సిల్క్ సిటీగా ఉన్న ధర్మవరం పట్టణం గ్రీన్ సిటీగా మారాలని... అలాగే కాలుష్య రహిత పట్టణంగా ఉండాలని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆకాంక్షించారు. ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి విగ్రహాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఆర్యవైశ్య యువజన సంఘాన్ని శ్రీరామ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.... పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన ధర్మవరం పట్టణానికి మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున వస్తుంటారని... ఇలాంటి సమయంలో మన ప్రాంతం పరిశుభ్రంగా కాలుష్యరహితంగా ఉండాలన్నారు. అలాగే పెద్ద ఎత్తున మొక్కలు పెంచి గ్రీన్ ధర్మవరంగా మారాలని కోరుకున్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడకుండా మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్యరహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**- రాష్ట్రంలో పట్టణ ప్రగతి, ప్రజల్లో సుఖసంతోషాలు నిండాలి..**
**- నెల్లూరు మరియు రాష్ట్ర ప్రజలకు శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి: మంత్రి నారాయణ**
**- విఘ్నేశ్వరుని కృపతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలి: మంత్రి పొంగూరు నారాయణ**

**నెల్లూరు సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ మీ జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు ప్రసాదించాలని ఆయన మనసారా ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో మన రాష్ట్రంలో పట్టణ ప్రగతి, మౌలిక వసతుల కల్పన మరియు సమగ్ర అభివృద్ధి మరింత వేగవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునట్లు తెలిపారు... ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని, ఆ భక్త సులభుని అనుగ్రహం మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, మరొక్కసారి అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు అని తెలియజేశారు.

# ధర్మవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ ఆదేశాల మేరకు ధర్మవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ నూతన కమిటీని ఆదివారం ధర్మవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు కె. మురళీగౌడ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో నూతన కమిటీని తీర్మానించారు.

**నూతన కమిటీ ఎంపిక.**

గౌరవాధ్యక్షుడిగా కె. మురళీగౌడ్, అధ్యక్షుడిగా బి. వెంకటేశ్వర చౌదరి, ఉపాధ్యక్షులుగా జి. రాజా, పి. నాగార్జున, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గంటపార నాగరాజు. సహాయ కార్యదర్శులుగా శ్రీనాథ్ గౌడ్, మంజునాథ్, కోశాధికారిగా ఎస్. అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, బాబయ్య, దేవేంద్ర, మల్లికార్జున, చెన్నప్ప, వెంకటేష్‌లను ఎన్నికయ్యారు. అనంతరం ధర్మవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీ సభ్యులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు కె. మురళీగౌడ్, అధ్యక్షుడు బి. వెంకటేశ్వర చౌదరి, ప్రధాన కార్యదర్శి గంటపార నాగరాజు మాట్లాడుతూ.... జర్నలిస్టులంతా ఐకమత్యంగా మెలగాలని, తమ సమస్యల పరిష్కారానికి సమష్టిగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అపారమైన నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నికన చేసిన,ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు, జిల్లా కమిటీ ప్రతినిధులకు ఎన్నికైన సభ్యులు ప్రత్యేక అభినందనలు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు ప్రసాద్ రెడ్డి, దేగల రవి, రవికుమార్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలకు ప్రైవేటు వాహనాలపై ఎలాంటి ఆంక్షలు లేవు

**- రోజుకు 15 వేల వాహనాలకే అనుమతి అంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం: టీటీడీ**

**తిరుమల, సెప్టెంబర్ 13:అనంత జనశక్తి న్యూస్**

తిరుమలకు వచ్చే ప్రైవేటు వాహనాలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని తిరుమల తిరుపతి దేవస్థానం స్పష్టం చేసింది. రోజుకు 15 వేల ప్రైవేటు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ తరువాత వచ్చే వాహనాలను చెక్‌పాయింట్ల వద్ద నిలిపివేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపింది.తిరుమలకు వచ్చే ప్రైవేటు వాహనాల సంఖ్యపై ఈ తరహా ఎలాంటి నిర్ణయాన్ని టీటీడీ తీసుకోలేదని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న తప్పుడు సమాచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.టీటీడీకి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు, సమాచారాన్ని అధికారిక ప్రకటనల ద్వారా మాత్రమే తెలియజేస్తామని స్పష్టం చేసింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా భక్తులను అయోమయానికి గురిచేయడం సరికాదని పేర్కొంది.టీటీడీ పేరుతో తప్పుడు వార్తలు, అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**- విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలి: మంత్రి అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 13 :అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.వినాయకుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలని మంత్రి కోరారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభించాలని ఆకాంక్షించారు.వినాయక చవితి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రజలంతా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రసాయనాలు, హానికర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుస్థిర అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరింత విస్తరించాలని మంత్రి ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరారు.

# స్వచ్ఛంద సేవ కు ఉత్తమ అవార్డు, ఉత్తమ ప్రశంసా పత్రం



**- న్యాయవాదులు... సుమలత, బాల సుందరి.**

**ధర్మవరం సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో కోర్టులో న్యాయవాదులుగా విధులు నిర్వహిస్తున్న సుమలత, బాల సుందరి లకు కర్ణాటక రాష్ట్రంలోని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ వారు అవార్డు, ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివరాజు గత 15 సంవత్సరాలుగా ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమల రాజు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సేవలు అందిస్తున్న వారి జాబితాను గుర్తించి, 50 మందికి పైగా స్వచ్ఛంద సేవ సంస్థల నిర్వాహకులను గుర్తించారు. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణంలో లాయర్ సుమలత, లాయర్ బాలసుందరి వారు న్యాయవాద వృత్తిలో ప్రత్యేకంగా రాణిస్తూ, మరొకపక్క స్వచ్ఛంద సేవా సంస్థలలో తమ వంతుగా ప్రజలకు వివిధ రకాలుగా సేవలు అందిస్తూ మంచి గుర్తింపును పొందడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులైన శివరాజు ఈ ఇరువురి న్యాయవాదులను గుర్తించి ప్రత్యేక ఆహ్వానితులుగా బెంగళూరుకి వారిని పిలవడం జరిగింది. అనంతరం బెంగళూరు... యలహంకాలోని డాక్టర్ అంబేద్కర్ భవన్లో వీరిని ఘనంగా సత్కరించారు. తదుపరి సభలో వీరు చేసిన సేవలను అక్కడి వారికి తెలియజేశారు. నేడు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక రూపాలలో వివిధ రంగాలలో తమదైన శైలిలో సేవలు అందించడం భగవంతుడు ఇచ్చిన వరము అని వారు వర్ణించారు. ఈ సందర్భంగా లాయర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు, ఈ ప్రశంసా పత్రం మా బాధ్యతలను మరింతగా పెంచిందని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'లేపాక్షి తైలవర్ణ చిత్రాలు అద్భుతం'



**- శ్రీనివాసరాజు**

**లేపాక్షి; సెప్టెంబర్ 13:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్య సాయి జిల్లా లేపాక్షిలో వెలసిన శ్రీదుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి గుడిలో శిల్పకళతో పాటు, తైలవర్ణ చిత్రాలు అత్యద్భుతంగా ఉన్నాయని 'తెలంగాణ రాష్ట్ర స్థిరాస్తి నియంత్రణ ప్రాధికార సంస్థ (TS RERA)' అధ్యక్షుడు శ్రీకేఎస్ శ్రీనివాసరాజు అభిప్రాయపడ్డారు. కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన లేపాక్షి శ్రీదుర్గామాత, శ్రీపాప నాశేశ్వర, శ్రీవీరభద్ర స్వామి లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడి ఎదుట ఉన్న మహా మండపం పైకప్పు పైగల వీరభద్ర స్వామి మహోగ్ర రూపంలో తీర్చిదిద్దిన అతిపెద్ద తైల వర్ణ చిత్రం విజయనగర సామ్రాజ్య చిత్రకారుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. అదేవిధంగా వట పత్రశాయిగా పిలవబడుతున్న చిన్ని కృష్ణుని రంగుల చిత్రం నాట్యమండపానికి సరికొత్త అందాలను చేకూర్చిందని శ్రీనివాసరాజు పేర్కొన్నారు. నేలను తాకని ఆకాశ స్తంభం, నాగలింగం, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి బసవయ్య నాటి శిల్పుల ప్రతిభకు తార్కాణంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. లేపాక్షి ఆలయ చరిత్ర, శిల్పకళ విశిష్టతను చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు. తాను రాసిన లేపాక్షి పుస్తకాన్ని శ్రీనివాసరాజు మిత్ర బృందానికి మైనాస్వామి బహుకరించారు. నేషనల్ హైవేస్ సలహాదారుడు శ్రీకె.నయీముల్లా, శ్రీసుధాకరరెడ్డి (ఆర్ అండ్ బి), శ్రీ విజయ నాయుడు (అమరరాజా), డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ ఎస్.రామ్మోహన్ తదితరులు వీరభద్ర స్వామి సన్నిధిని దర్శించారు. అర్చకులు లక్ష్మీనరసింహ శర్మ తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు.

# యువతకు ఉద్యోగావకాశాలు.. 16న జాబ్ మేళా

**- అర్హత ఉన్న ప్రతి యువతీ, యువకుడు సద్వినియోగం చేసుకోవాలి.. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్**

**అనంతపురం సెప్టెంబర్ 13,అనంత జనశక్తి న్యూస్**



**నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 16న అనంతపురం నగరంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. APSSDC, అనంతపురం జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రైవేట్ రంగ సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. SSC, ITI, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, B.Tech, UG, PG తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరై తమకు అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, మంచి ఉపాధి అవకాశాలను పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి జాబ్ మేళా వేదికకు చేరుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.**

# అంకురార్పణతో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు బీజం

**- సెప్టెంబర్ 14న సేనాధిపతి ఉత్సవం.. అనంతరం అంకురార్పణ ఘట్టం**

**తిరుమల, సెప్టెంబర్ 13: అనంత జనశక్తి న్యూస్**

తిరుమల శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14న అంకురార్పణతో శ్రీకారం చుట్టనున్నారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం సెప్టెంబర్ 14న రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపట్టడం ఆగమ సంప్రదాయంగా వస్తోంది. నవధాన్యాలను మొలకెత్తించి భూమండలం పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్య శ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు.

**సేనాధిపతి ఉత్సవం**

అంకురార్పణకు ముందు సెప్టెంబర్ 14న రాత్రి సేనాధిపతి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. శ్రీవారి సర్వ సైన్యాధ్యక్షుడైన శ్రీ విష్వక్సేనులవారిని తిరుమలలోని నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శ్రీ విష్వక్సేనులవారు మాడ వీధుల్లో విహరిస్తారని ఆగమ సంప్రదాయం చెబుతోంది.

**మేదినిపూజ అనంతరం అంకురార్పణ**

నవధాన్యాలు మొలకెత్తేందుకు అవసరమైన పుట్టమన్నును సేకరించే ముందు భూదేవిని ప్రసన్నం చేసుకునేందుకు మేదినిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు భూసూక్తాన్ని పఠిస్తారు.అనంతరం యాగశాలలో పాలికలు అనే మట్టికుండల్లో పుట్టమన్ను నింపి, నవగ్రహాలకు సంకేతంగా నవధాన్యాలను విత్తుతారు. అవి చక్కగా మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. గోధుమలు సూర్యుడికి, బియ్యం చంద్రుడికి, కందులు కుజుడికి, పెసలు బుధుడికి, శనగలు బృహస్పతికి, అలసందలు శుక్రుడికి, నువ్వులు శనికి, మినుములు రాహువుకు, ఉలవలు కేతువుకు సంకేతాలుగా భావిస్తారు.యాగశాలలో పాలికల చుట్టూ అష్టదిక్పాలకులతో పాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు. ఈ నవధాన్యాలను బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల పాటు పెంచి, చివరి రోజున మొలకలను వేరుచేసి స్వామివారికి అక్షతారోపణ చేస్తారు. మొలకలు ఎంత బాగా చిగురిస్తే బ్రహ్మోత్సవాలు అంత ఘనంగా సాగుతాయని భక్తుల విశ్వాసం.



# వయోవృద్ధుల కోసం కార్యాలయ స్థలాలను కేటాయించాలి

**అనంతపురం సెప్టెంబర్ 13,అనంత జనశక్తి న్యూస్**

వయోవృద్ధుల సంక్షేమం కోసం చర్చించుకోవడానికి ఆఫీస్ కి కావాల్సిన స్థలాల్ని ప్రభుత్వం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదని రాష్ట్ర అధ్యక్షులు కే రామచంద్రరావు అన్నారు.

ఆదివారం స్థానిక రాజ్యలక్ష్మి ఆధ్యాత్మిక ఆశ్రమంలో ఆంధ్రప్రదేశ్ వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సర్వే సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు కే రామచంద్రరావు,ముఖ్య సలహాదారులు డి గోవిందరాజులు, జిల్లా ఉపాధ్యక్షులు బి పెద్దన గౌడ్, విశిష్ట అతిథులుగా మాజీ అధ్యక్షులు వి సదాశివన్, మీనాక్షమ్మ సమ్మిళిత వికాస్ కేంద్రం వ్యవస్థాపకులు రవికాంత్ రమణ, మాట్లాడుతూ వయోవృద్ధులను అనాధలుగా కాకుండా ప్రేమతో చూడాలని, వారు పెంచిన జ్ఞానం సంపద అనుభవాలు భవిష్యత్ తరానికి అవసరమని అన్నారు




అందుకు భిన్నంగా ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేసిన వాటిపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వం పాత్ర విఫలమైందని ఫలితంగా నేటికీ వృద్ధులు సంపాదించిన ఆస్తులను సంపదను తీసుకొని బయటికి తరిమేస్తున్నారని వారు అనాధ శరణాలయాలలో బ్రతుకులు వెళ్లదీస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వృద్ధుల హక్కుల పట్ల సరైన అవగాహన కల్పించాలని వారు సమూహంగా చర్చించుకునేందుకు తగిన సమావేశ స్థలాలను కేటాయించాలని గతంలో వృద్ధులకు ఇస్తున్న రాయితీలను యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులు ఎం వెంకటరమణ, సహా అధ్యక్షులు పరుచూరి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులు వై సూర్యనారాయణ రెడ్డి, జిఎంవి చలపతి, ఏవి సుధాకర్ బాబు, ప్రధాన కార్యదర్శి జి తిప్పేస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శులు కే. సత్యనారాయణ, టీవీ రెడ్డి, కార్యదర్శులు కే కాసిం, వి నాగ రాజేశ్వరి, బి సునీల్ కుమార్, కోశాధికారి ఎన్ బాబ్జాన్, కార్యవర్గ సభ్యులు ఎస్ఎండి హనీఫ్, కే లక్ష్మీనారాయణ, పిజి నాగభూషణం, పిటి శేషాచార్యులు, ఇ ఓ రాముడు, ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం ముఖ్య అతిథులకు పూర్వ ప్రతినిధులకు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటరమణారెడ్డి, వెంకటేష్ శెట్టి, పీజీ నాగభూషణం, హెచ్ఎండి హనీఫ్, రామసుబ్బన్న, చౌప్ప వీరభద్రప్ప, యాడికి సూర్యనారాయణ రెడ్డి, కే అల్తాఫ్, ఎస్ రామిరెడ్డి వివిధ మండలాల కార్యవర్గ ప్రతినిధులు సాధారణ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు, మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**- నగర ప్రజలకు జర్నలిస్టులకు విగ్రహాలు మొక్కలు అందజేసిన ఎమ్మెల్యే**
**- ఏపీడబ్ల్యూజేఎఫ్ ను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ఎల్. నినో వంటివి ఎదుర్కోవాల్సి వస్తుంది.. ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్న ఎమ్మెల్యే**
**- సమాజం కోసం తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమం చేపట్టామన్న రేపటి రామాంజనేయులు**

**అనంతపురం సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**

పర్యావరణాన్ని మనం కాపాడుకోకపోతే ఎలినినో వంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్ వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆయన మట్టి వినాయక విగ్రహాలను, మొక్కలను పంపిణీ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజనేయులుతో పాటు ఇతర నాయకులతో కలిసి ఆయన ప్రజలకు, జర్నలిస్టులకు మట్టి విగ్రహాలు మొక్కలు అందజేశారు. మీరు తీసుకున్న ప్రతి మొక్క ఒక వృక్షమై పర్యావరణాన్ని కాపాడాలని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. జర్నలిస్టులు అంటే అవేర్నెస్ కి కేరాఫ్ అని అలాంటి వ్యక్తులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇలా మట్టి విగ్రహాలు మొక్కలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అలా చేయకపోతే భవిష్యత్తులో వచ్చే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. ఇప్పటికే ఎల్ నీ నో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని తాగునీటి సమస్య కూడా ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్తులో రాకూడదంటే కచ్చితంగా ప్రతి ఒక్కరు తమవంతుగా బాధ్యత తీసుకొని కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారన్నారు. విండ్ సోలార్ పవర్ పరిశ్రమలను పెద్ద ఎత్తున తీసుకొచ్చి కార్బన్ రహిత వాతావరణం ఉండేలా చూస్తున్నారని అన్నారు. ఇటీవల రాయదుర్గంలో 10,500 కోట్లతో సుజలాన్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ను ప్రారంభించారన్నారు.




ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా కలిసి వస్తేనే కాలుష్యరహిత సమాజం సాధ్యమవుతుందని దగ్గుపాటి అన్నారు. పండుగన్నది ప్రతి ఒక్కరికి మంచి చేసేలా ఉండాలని.. అందుకే ప్రతి వినాయక చవితికి మట్టి విగ్రహాలను, మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు తెలిపారు. సమాజం కోసం తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ జరగడం చాలా సంతోషంగా ఉందని... తాము చేపట్టిన సంకల్పం మరికొంత ముందుకు వెళ్లే విధంగా ఆయన సహకరించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. విగ్రహాలు పంపిణీ అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులుతో పాటు టిడిపి నాయకుడు ఇనయతుల్లా ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్, రాష్ట్ర నాయకుడు జయప్రకాష్, బ్రాడ్కాస్టింగ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్కే సూర్య, చిన్న పత్రికల సంఘం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రాములు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రచార కార్యదర్శి అమర్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, పట్టణ అధ్యక్షుడు కేశవ, ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, రవి, అనిల్ కుమార్, వెటర్న్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, రామ్మూర్తి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల సమన్వయ సమావేశం

**అనంతపురం సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా కేంద్రంలో కూటమి పార్టీల స్థానిక సంస్థల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల పరిశీలకులు, మాజీ మంత్రి ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కాపు రామచంద్రారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు జయరాం రెడ్డి, దేవరకొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు.



# జిల్లాలోని ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు



**అనంతపురము, సెప్టెంబర్ 13 :అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని పండుగ శుభాకాంక్షలను గౌ.జిల్లా ఇంచార్జి మంత్రి మరియు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, గౌ. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు శాసన సభ వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శాసన మండలి సభ్యులు, ఎంఎల్ఏలు, జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల తదితరులు తెలిపారు.వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, అన్ని విఘ్నాలను, సంకటాలను హరించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరి ఇంటా విఘ్నాలు తొలగి వారు ఆయు ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో సిరి సంపదలతో తుల తూగాలని సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని చేసే కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడరాదని, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేలా మట్టి వినాయకులని ఉపయోగించాలని, సామరస్య, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.









# కాకినాడ సమగ్ర అభివృద్ధికి భారీ ప్రాజెక్టులు..

- రూ.354 కోట్ల తాగునీటి ప్రాజెక్టు.. రూ.39 కోట్లతో రహదారుల అభివృద్ధి, రూ.25 కోట్లతో గ్రీనరీ.. రూ.200–250 కోట్లతో యూజీడీ ఏర్పాటుకు కసరత్తు.
- రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ




**కాకినాడ,సెప్టెంబర్ 13:అనంత జనశక్తి ప్రతినిధి**

కాకినాడ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రాజెక్టులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.

ఆదివారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక అభివృద్ధి, ప్రాజెక్టుల పైనిర్వహించినసమావేశానికి రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ .హరేంధిర ప్రసాద్,కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు .

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. కాకినాడ పట్టణంలో తాగునీరు,రహదారులు, పారిశుధ్యం,గ్రీనరీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి కీలక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మంత్రి తెలిపారు.కాకినాడలో రూ.354 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని, నీటి కేటాయింపులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్నందున పనులను మరింత వేగవంతం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా పరిసర మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి సేకరించే ఘన వ్యర్థాలను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తామన్నారు.నగర పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎండ్ టు ఎండ్ రోడ్లుఅవసరమని పేర్కొన్న మంత్రి, రహదారుల అభివృద్ధికి రూ.39 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాలెన్స్ రోడ్లతో పాటు కచ్చా, గ్రావెల్ రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. స్వీపింగ్ యంత్రాలు సమర్థంగా పనిచేసేందుకు రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో గ్రీన్ ఏరియాను 50 శాతానికి పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా కాకినాడలో పార్కులు, గ్రీనరీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని,త్వరలో ఖరారు చేసి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నగర పారిశుధ్య సమస్యల కు శాశ్వత పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థే నని మంత్రి స్పష్టం చేశారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు బహిరంగ డ్రైన్లలోకి చేరకుండా భూగర్భ పైపుల ద్వారా తరలించేలా యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.కాకినాడలో యూజీడీ ప్రాజెక్టు కు రూ.200-250 కోట్ల వరకు నిధులు సమ కూర్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, యూఐడీఎఫ్3, యూఐడీఎఫ్4 తదితర పథకాల ద్వారా నిధుల సమీకరణకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కన్సల్టెంట్‌ను నియమించి ప్రాజెక్టును త్వరగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం:**

సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ.. కాకినాడ నగరంలో ఇప్పటికే మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పెండింగ్ ప్రతిపాదనలు,భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షిస్తున్నామన్నారు. పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగు పరచడం తో పాటు అవసరమైన చోట్ల రహదారుల నిర్మాణం, డ్రైనేజీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలనిఅధికారులకు సూచించినట్లు చెప్పారు. నగరంలో మురుగునీరు శుద్ధి చేయకుండా సముద్రం లోకి చేరకుండా ఎస్టీపీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతం లో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన పనులతో పాటు ఇంకా పూర్తి చేయాల్సిన పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు,ఎస్ఈ పి.వెంకటరావు,హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వి చరణ్, ఈఈలు మాచిరాజు, కనకారావు, మెప్మా పీడీ శైలజ, టౌన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

# బందరుకి ఆధ్యాత్మిక, పర్యాటక శోభ తీసుకొచ్చేలా గణపతి ఉత్సవాలు




- మంగినపూడి సాగరతీరంలో భారీ ఎత్తున నవరాత్రి వేడుకలు
- కట్టుదిట్టంగా ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు
- ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు
- బందరు అంటే పర్యాటకం, పరిశ్రమలు అనేలా చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర భరోసా

**మచిలీపట్నం సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

మచిలీపట్నం సముద్ర తీరాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, కళా క్షేత్రంగా మార్చి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ.. మంగినపూడి సాగరతీరం గణపతి నవరాత్రులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోబోతోంది. లోక కల్యాణార్థం 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మహాగణపతి ఆలయంతో పాటుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయం, సింహాచలం వరాహనరసింహస్వామి వారి దేవాలయం, భద్రాద్రి రాముల వారి నమూనా ఆలయాలు, ప్రచార రథాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సాగరతీరంలో హోమాలు ఏర్పాటు చేసుకుని మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కుల మత ప్రాంతాలకు అతీతంగా భక్తులంతా హాజరవుతుండడం ఆనందం. పర్యాటక రంగం, దేవాదాయ శాఖ నుండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయం.కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రత్యేకంగా ట్రాఫిక్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంతం మొత్తాన్ని వన్ వే చేశాం. తద్వారా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకమూ ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ఏపీలోనే మొట్టమొదటి సారిగా ఈ ప్రాంతం మొత్తంలో భారీ ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశాం. సముద్రతీరంలో లైట్లు, వాచ్ టవర్స్ ఏర్పాటు చేశాం. ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచాం. కార్యక్రమానికి ముఖ్యమంత్రి, గవర్నర్ సహా ఎంతో మంది ప్రముఖులు హాజరవుతారు. ప్రతి ఇంటి నుండి మట్టి సేకరించాలనే పిలుపు మేరకు విగ్రహ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఖైరతాబాద్ విగ్రహం నిర్మాణం చేపట్టే నిపుణులతోనే నిర్మించడం జరిగింది. సముద్రతీరంలో హోమ గుండాలు ఏర్పాటు చేశాం. కర్నాటక నుండి వచ్చే కొంత మంది పీఠాధిపతులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ వేగంగా పూర్తవడంతో పాటుగా, ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక పర్యాటక పారిశ్రామిక శోభ కలిగేలా కార్యక్రమాలు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధికి అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా ఈ ప్రాంతంలో రూ.100 కోట్లతో పెట్టుబడులు రాబోతున్నాయి.పర్యాటకులు వచ్చి వెళ్లేలా కాకుండా.. ఇక్కడే ఉండేందుకు వీలుగా కొన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. సుమారు 750 ఎకరాలను గుర్తించాం. వాటిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఆ భూముల్ని పర్యాటకంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. గోల్ఫ్ కోర్ట్, ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో స్టూడియోల నిర్మాణం సహా అనేక పెట్టుబడులు రాబోతున్నాయి.




స్పీడ్ బోట్స్, పారా గ్లైడింగ్ లాంటి వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. పది రోజుల పాటు జరిగే వేడుకల అనంతరం జెట్ స్ప్రింక్లర్స్ ద్వారా స్వామి వారి నిమర్జనం జరుగుతుంది. ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఈ ఉత్సవాన్ని ఇలాగే ప్రతి సంవత్సరం కొనసాగించడంతో పాటుగా, స్థానిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం బీచ్ ఫెస్టివల్ సహా వారాంతంలో కూడా వినోద కార్యక్రమాలు నిర్వహిస్తాం. మచిలీపట్నం సముద్రతీరంలో నిరంతరం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ.. పర్యాటక శోభ తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# కడియం నర్సరీల ప్రత్యేకతను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టాలి

- మంత్రి కందుల దుర్గేష్
- సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఫ్లోరీ కల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు కృషి
- రైతుల రుణ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి బ్యాంకింగ్ అధికారులతో త్వరలో ముఖాముఖి
- కడియం నర్సరీ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**



కడియం నర్సరీల ప్రత్యేకతను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టాలని నూతనంగా ఏర్పాటైన అసోసియేషన్ కు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం గ్రామంలోని జీఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్' నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులకు మంత్రి దుర్గేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యయుతంగా, సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన అసోసియేషన్, నర్సరీ రైతాంగానికి మేలు చేకూర్చేలా పనిచేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా కడియం నర్సరీలు సాధించిన గుర్తింపును ప్రస్తావిస్తూ, ఈ ప్రత్యేకతను కాపాడుకునేలా నూతన పాలకవర్గం శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీ రంగంలో 10 శాతం రైతులు మాత్రమే ఆర్థిక పరిపుష్టి సాధించారని, 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల మంజూరులో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి త్వరలోనే బ్యాంకింగ్ ప్రతినిధులు, అసోయేషన్, నర్సరీ రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక పూలసాగు పద్ధతులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ప్రాంతీయంగా 'ఫ్లోరీ కల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. గతంలో నర్సరీలకు ఉచిత విద్యుత్ కొనసాగించడంలో, వాల్టా చట్టం విషయంలోనూ ప్రత్యేక చొరవ తీసుకున్నామని గుర్తుచేశారు. అటవీ ప్రాంతాలకు పర్యావరణ హితమైన మొక్కల సరఫరా అనుమతులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.కడియం నర్సరీ రంగం తమకు సొంతింటి లాంటిదని పేర్కొంటూ, చిట్టచివరి రైతుకు సైతం సంక్షేమ ఫలాలు అందేలా అసోసియేషన్ స్పష్టమైన కార్యాచరణతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నర్సరీ రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన మాజీ నర్సరీ అధ్యక్షులు రత్నం అయ్యప్పను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన బొర్సు సుబ్బారాయుడుతో పాటు పాలకవర్గ సభ్యులు కామిశెట్టి వెంకటేష్, ఉండమట్ల అర్జున్, దూలం సత్యనారాయణమూర్తి, గట్టా కృష్ణ భగవాన్, సానా పల్లపురాజు, దేగల రాము, పుల్లా శ్రీను, బోడపాటి చంద్రశేఖర శ్రీనివాస్, పాటంశెట్టి శ్రీనివాస్, తాడాల సత్యనారాయణ, అన్నందేవుల వెంకటేశ్వరరావు మరియు ఇతర సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ అందరి మన్ననలు పొందేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

# గౌరీ పండుగ సందర్భంగా అక్కచెల్లెమ్మలకు చీరల పంపిణీ



**అగళి సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలం రామాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు జయరాం ఆధ్వర్యంలో గౌరీ పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రతి అక్కచెల్లెమ్మలకుపసుపు -కుంకుమతో చీరలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై అక్కచెల్లెమ్మలకు చీరలు అందజేసి గౌరీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ కేంచు యాదవ్,మాజీ సర్పంచ్ రవికుమార్, కోడీహళ్ళి రమేష్, కమ్మరి శివన్న, బ్యాడిగెర సురేష్, గొల్లహట్టి రెడ్డి, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు మల్లికార్జున, వేణుగోపాల్, జయరామప్ప, రామకృష్ణప్ప, తిప్పన్న, దాసే గౌడనహల్లి రంగనాట్, తదితర టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మద్యం షాపుల రెన్యువల్ నిమిత్తం గెజిట్ విడుదల.



- ఎక్సైజ్ సి ఐ చంద్రమణి

**ధర్మవరం సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 ఓపెన్ క్యాటగిరి, రిజర్వ్ కేటగిరి ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మద్యం షాపుల రెన్యువల్ నిమిత్తం గెజిట్ విడుదల చేయడం జరిగిందని ఎక్సైజ్ చంద్రమణి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... సెప్టెంబర్ 12వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఆన్లైన్ హైబ్రిడ్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. లైసెన్స్ ఫీజు మొత్తంలో 38 శాతం రెన్యువల్ ఆర్ఈటి మొత్తమును చెల్లించవలసి ఉంటుంది అని తెలిపారు. దీనికి అదనంగా 202627 సంవత్సరమునకు మొత్తం లైసెన్స్ ఫీజును ఏక మొత్తంలో గాని లేక ఈ టి ఓ పి 1/4 మొత్తముగా గాని చెల్లించాలన్నారు. అదేవిధంగా తమ పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజులో మూడవ వంతు చెల్లించవలెనని తెలిపారు. తదుపరి ప్రాసెసింగ్ ఫీజు మొత్తము కమిషన్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వారికి 5 వేల రూపాయలు డి డి రూపంలో చెల్లించాలన్నారు. అర్హులైన లైసెన్స్ దారులకు 6/10/2026 నుండి30/09/2027 వరకు మద్యం అమ్మకమునకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# కీర్తన గోల్డ్ లోన్ ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ




**అగళి సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలోనీ కీర్తన గోల్డ్ లోన్ కేంద్రం ఆధ్వర్యంలో మేనేజర్ మహేష్ ప్రజలకు చిన్న మట్టి గణపతులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కీర్తన గోల్డ్ లోన్ ఏం.డి ఆదేశాల మేరకు సుమారుగా 40మందికి దాక మట్టితో తయారు చేసిన గణపతులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందరికీ ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మేనేజర్ మహేష్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో వర్షాలు బాగా కురిసి వ్యవసాయం అభివృద్ధి చెంది, ప్రజలందరి లో విఘ్నాలు తొలగి, సుఖ సంతోషలతో ఉండాలని, అందరూ ఆయురోగ్యాలతో సకల సిరి సంపదలతో శుభాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టి ఎల్ ఓ ఎస్.కృష్ణ తదితరులు వున్నారు

# పార్టీకి సేవ చేయడమే నా లక్ష్యం

- డోర్ టు డోర్ కార్యక్రమంలో సర్వేయర్ సురేంద్ర

**అమడగూరు, సెప్టెంబర్ 13: అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీకి సేవ చేయడమే తన ముఖ్య లక్ష్యమని సర్వేయర్ సురేంద్ర అన్నారు. అమడగూరు మండలంలోని ఆమడగూరు పంచాయతీ పరిధిలోని ఏపుట్ల వాండ్లపల్లి గ్రామంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, పార్టీ కార్యకర్తలకు సేవ చేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని సురేంద్ర తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన నూతన పింఛను పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తూ భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి తిరుపాల్, సీనియర్ నాయకులు దొనకొండ వెంకటరమణ, క్షేత్ర సహాయకుడు రామాంజులు, పాతపాలెం వెంకటరమణ, తెలుగు యువత నాయకులు గుడ్ల సోము, గుడ్ల అంజి, పాతపాలెం రవి, ఈ. రామప్ప తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ యోగి వేమన సన్నిధిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు..



**- ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ యోగివేమన ఆలయానికి భక్తులకు ఆహ్వానం నంద ఎమ్మారెడ్డి..**

**గాండ్లపెంట, సెప్టెంబర్,13, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని కటారుపల్లి గ్రామంలో వెలసిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ యోగివేమన ఆలయానికి వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. వినాయకుడిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాన్ని వివిధ రకాల పూల తోరణాలు, పండ్ల మొక్కలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ముందు ప్రత్యేక ముఖద్వారాన్ని ఏర్పాటు చేసి భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఐదు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా కటారుపల్లికి తరలివచ్చి శ్రీ యోగివేమన స్వామివారిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## గణనాథుని విగ్రహాల కొరకు 80,000 వేల రూపాయలు విరాళం అందజేసిన డికె బాబు



**తలుపుల సెప్టెంబర్ 13(అనంత జనశక్తి న్యూస్):-**

మండల కేంద్రంలోని వినాయక చవితి సందర్భంగా గణనాథుని విగ్రహాల కొరకు తలుపుల పంచాయితీ, టి. రెడ్డివారి పల్లి కమిటీ సభ్యులకు రూ.20 వేలు, నూతన కాలువ పంచాయతీ దండువారిపల్లి కమిటీ సభ్యులకు రూ.15 వేలు, ఉడమలకుర్తి పంచాయతీ, చిన్నపల్లి కమిటీ సభ్యులకు రూ.15 వేలు, వేపమాని పేట పంచాయతీ, ఉసేగారి పల్లి కమిటీ సభ్యులకు రూ.10 వేలు, బట్రేపల్లి పంచాయతీ కమిటీ సభ్యులకు రూ. 10 వేలు, కుర్లి పంచాయతీ, రెడ్డివారి పల్లి కమిటీ సభ్యులకు 10 వేల రూపాయలు విరాళాలను తలుపుల వైయస్సార్సీపి మండల కన్వీనర్ డికె బాబు వారి ఆఫీసు నందు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ డీకే బాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే పరిష్కరిస్తానని మండల ప్రజలకు ఎప్పుడూ నేను వెన్నంటే ఉంటానని, ఏ కష్టం వచ్చినా తీర్చే నాయకుడు లా కాకుండా ప్రజలలో ఒకడిలా, మీ కుటుంబ సభ్యులలో ఒకడిలా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గణనాథుని విగ్రహ కమిటీ సభ్యులు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌ను యథావిధిగా నిర్వహించాలి

**- ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలి**
**- 1100 టోల్‌ఫ్రీ, మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదుల నమోదు**
**- క్యూఆర్ కోడ్ ద్వారా సేవలపై అభిప్రాయం తెలిపే అవకాశం**
**- జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి,**

**పాడేరు, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**



ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో భాగంగా పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌ను యథావిధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్,టి. నిశాంతి,అధికారులను ఆదేశించారు.జిల్లాలోని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్హత పత్రాలు, అవసరమైన వివరాలతో నేరుగా హాజరై అర్జీలు సమర్పించుకోవచ్చని తెలిపారు.పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నేరుగా హాజరు కాలేని ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చని, అలాగే మీకోసం వెబ్‌సైట్ (meekosam.ap.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సమర్పించిన అర్జీల స్థితి, పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు కూడా 1100 నంబర్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.పీజీఆర్ఎస్ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు జిల్లా, మండల స్థాయి కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత సేవలను పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అనుభవం, అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు.పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల నుంచి వచ్చే అసంతృప్తి స్పందనలను జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా సమీక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడి సమస్య స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకుని, వారికి సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి కార్యాలయం, 1100 కాల్ సెంటర్, సూపర్ ఆడిట్ తదితర మార్గాల ద్వారా గుర్తించే అసంతృప్తి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా విధి నిర్వహణలో లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులైన అధికారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, చేపట్టిన చర్యల నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా కూడా వివిధ పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు 1100, మీకోసం వెబ్‌సైట్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అందుబాటులో ఉన్న మార్గాలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె కోరారు.

# అటవీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు



**- పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు**
**- ఎర్రచందనం అక్రమ రవాణాను ఏమాత్రం ఉపేక్షించం**
**- విధి నిర్వహణలో గాయపడిన సిబ్బందికి అండగా ఉంటామన్న పవన్ కళ్యాణ్**
**- ఆపరేషన్ అరణ్యలో ప్రాణాలకు తెగించి ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న సిబ్బందికి ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అభినందనలు**

**అమరావతి సెప్టెంబర్ 13,**

**అనంత జనశక్తి న్యూస్**



ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో అటవీ సిబ్బంది గాయపడడం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా రొంపిచెర్ల మండలం బొమ్మాయిగారిపల్లి గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చేపట్టిన ఆపరేషన్ అరణ్యలో భాగంగా విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది వాహనాన్ని దుండగులు ఢీకొట్టిన ఘటనను తీవ్రంగా పరిగణించారు.ఎర్రచందనం అక్రమ రవాణాదారులు తమ వాహనంతో వేగంగా ఢీకొట్టిన ఘటనకు సంబంధించిన వివరాలను అటవీ శాఖ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటనలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. ప్రకాష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి. రెడ్డి ప్రసాద్, కె. ప్రతాప్, అటవీ సిబ్బంది వాహనం డ్రైవర్ చరణ్ గాయపడినట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం గాయపడిన సిబ్బంది ప్రమాదం నుంచి బయటపడి చికిత్స పొందుతున్నారని అధికారులు ఆయనకు వివరించారు. గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, చికిత్సకు అయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, సిబ్బంది పూర్తి స్థాయిలో కోలుకునే వరకు అటవీ ముఖ్య సంరక్షణాధికారి(PCCF) పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఎర్ర చందనం స్మగ్లర్లను పట్టుకునే ఆపరేషన్ అరణ్యలో ప్రాణాలకు తెగించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు ఎర్రచందనం దుంగలు, తూకం యంత్రం, రంపం బ్లేడ్, గొడ్డళ్లు, అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బందిని పవన్ కళ్యాణ్ అభినందించారు. అటవీ సంపదను దోచుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఆ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా, అటవీ నేరాలు, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటవీ నేరాల నియంత్రణ విషయంలో కూటమి ప్రభుత్వం దృఢంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అక్రమ రవాణా ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ, పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురు నిందితులను త్వరగా పట్టుకోవాలని రెడ్ శాండర్స్ యాంటి స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ అధికారులను ఆదేశించారు

# గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు

**- గజరాజుల సంరక్షణపై ఆరా**
**- కుంకీ ఏనుగులకు ఆహారం అందించిన నాగబాబు**
**- ఖాళీ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులకు సూచన**

**పార్వతీపురం సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. పర్యటనలో భాగంగా గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రావి, వేప మొక్కలను నాటారు.అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రతీ ప్రదేశంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపుతోపాటు అటవీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.అనంతరం ఏనుగుల సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. అడవి ఏనుగుల సంచారాన్ని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాన్ని ఏనుగుల ట్రాకర్లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

వన్యప్రాణులు-మానవుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చేపడుతున్న ముందస్తు చర్యలను పార్వతీపురం డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్, ఎఫ్ఆర్ఓ తదితర అధికారులు మ్యాప్ సహాయంతో నాగబాబుకి వివరించారు. ఏనుగులు సంచరించే అటవీ ప్రాంతాల్లో నెలకొన్న కఠినమైన భౌగోళిక పరిస్థితులు, వాటి కదలికలను పర్యవేక్షించడంలో ఎదురవుతున్న ఇబ్బందులును, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలియజేశారు. ఏనుగుల సంరక్షణతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న క్షేత్రస్థాయి కృషిని నాగబాబు అభినందించారు.కుంకీ ఏనుగులకు చెరకు, బెల్లం తినిపించిన నాగబాబు

అనంతరం గుచ్చిమి సంరక్షణ కేంద్రంలోని జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగుల మావటిలతోపాటు పశు వైద్యుడిని నాగబాబు కలిశారు. ఏనుగుల ఆరోగ్యం, వాటి సంరక్షణ, ఆహారపు విధానం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం కుంకీ ఏనుగులకు రాగి, స్వీట్ కార్న్, చెరకు, బెల్లం వంటి ఆహారాన్ని తినిపించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సలహాదారుడు పి. మల్లికార్జున రావు, ఏపీసీసీఎఫ్ రాహుల్ పాండే, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి, విశాఖపట్నం సర్కిల్ సీసీఎఫ్ ఐ.కె.వి. రాజు, పార్వతీపురం మన్యం డిఎఫ్ఓ ఎస్. వెంకటేష్, విజయనగరం డిఎఫ్ఓ సోమసుందరంతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేశులు పిలుపు**

**అనంతపురం, సెప్టెంబర్ 13**

**:అనంత జనశక్తి న్యూస్**



భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పునరుద్ధరించిన పలు సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేశులు పిలుపునిచ్చారు. అనంతపురంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో నెం.6 భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. కార్మికుల వివాహం, ప్రసూతి, సాధారణ మరణం, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందించే పథకాలను ప్రతి కార్మికుడు తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి, గత సంవత్సరంలో కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసిన కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పలు పథకాలను పునరుద్ధరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలకు టీఎన్‌టీయూసీ తరపున కుంచపు వెంకటేశులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. అలాగే టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, వారి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారికి అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా టీఎన్‌టీయూసీ తరపున నిరంతరం పోరాటం చేస్తామని కుంచపు వెంకటేశులు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్, టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు తాడాల నాగభూషణం, ఆదినారాయణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**అనంతగిరి సెప్టెంబర్ 13:అనంత జనశక్తి న్యూస్**

మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని గిరి బాల నేస్తం క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశిపట్నం పంచాయతీ పరిధిలోని మండపర్తి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శిస్తూ పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచి వినాయకుడిని పసుపు ముద్దతో తయారు చేసి పూజించే సంప్రదాయం ఉందన్నారు. అయితే ప్రస్తుతం రసాయనిక రంగులు, నీటిలో కరగని పదార్థాలతో భారీ వినాయక విగ్రహాలను తయారు చేసి నిమజ్జనం చేయడం వల్ల నీటి

వనరులు కలుషితమవుతున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యంతో పాటు పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గిరి బాల నేస్తం క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్ టీచర్ అశ్విని, గిరిజన సంఘం నాయకులు దేముడు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

- ప్రతి ఇంటికి మట్టి విగ్రహాన్ని అందజేసిన ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్
- వినాయక చవితి పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్

**రాప్తాడు సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తన స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఇంటికి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. వెంకటాపురం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఈ మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి అంటే ఎంతో సందడిగా చేసుకునే పండుగ అని... అయితే ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడటం వల్ల నీటి కాలుష్యం బాగా పెరిగిందన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలన్న లక్ష్యంతోనే ఈ విగ్రహాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పండుగ అన్నది పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మట్టి వినాయక విగ్రహాలను గరికతో పూజించాలని... దీనిని ఎవరు మర్చిపోవద్దని సూచించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు వారు ప్రత్యేకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.....

# నా స్టైల్ స్మైల్ అది ఏకే 47 కన్నా పవర్ ఫుల్

- వైయస్సార్సీపి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు
- జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడం మన అందరి లక్ష్యం.
- రెడ్ బుక్ రాజ్యాంగం కాదు. మనది అంబేద్కర్ రాజ్యాంగం.
- కొత్త పెన్షన్లు ఎన్నికల స్టంటే

**రాయదుర్గం, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్:**




స్మైల్ నా స్టైల్ అది ఏకే 47 కన్నా పవర్ ఫుల్ అని వైఎస్ఆర్సిపి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సంస్థల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్ఆర్సిపి శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ తొందరలోనే స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల్లో మనమందరం ఐకమత్యంగా, ధైర్యంగా ముందుకు వెళదాం. మనకు వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గం లో రాబోయే స్థానిక ఎన్నికలలో వైసీపీ కుటుంబ సభ్యులు అందరూ ఐకమత్యంగా ప్రజల ముందుకు వెళ్లి గత జగనన్న పాలనలోని అభివృద్ధి గురించి తెలుపుతూ వైసిపి పార్టీని గెలిపించుకోవాలని, నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త నాయకుడు బాధ్యత తీసుకోవాలని మన జగనన్నను ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని పిలుపునిచ్చారు. గతంలో

వైసిపి పాలనలో జగనన్న నవరత్నాలలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలు పొందినాడని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పథకాలను ,జగనన్న అమలుపరిచిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డు నందు అందించిన విషయాలను తెలపాలని సూచించారు. అలాగే రెండేళ్లు గడిచిన కాలంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి సంక్షేమ పథకాలను అమలు చేయకుండా అబద్ధపు హామీలతో కాలం గడుపుతున్నారని గడిచిన రెండేళ్లలో పెన్షన్లు మంజూరు చేయలేదని, ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ జరగలేదని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, 18 ఏళ్ళు నిండిన ఆడపడుచులకు 1500 ఇస్తామని హామీ అమలు చేయలేదని, ఈ రెండేళ్లు కూటమి నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడి అక్రమ సంపాదనలో ముందున్నారని, ఈ రెండేళ్లు దోచుకున్న అవినీతి సొమ్ముతో ఎన్నికలలో ఖర్చు పెడుతున్నారని రాయదుర్గం పట్టణంలో మున్సిపాలిటీ వార్డులలో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారని ప్రజలకు తాగు నీటిని అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనికూటమి ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. మా వైసిపి పార్టీ అలా కాకుండా ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వైఫల్యాలను ఎండగడతామని ఇప్పుడు పెన్షన్ల మంజూరులో కూటమి నాయకులు కార్యకర్తలు తమకు అనుకూలమైన వారికి ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని ఇలా అయితే చాలామంది నిరుపేదలు అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ఆ వైపు అడుగులు వేయడం లేదని టిడిపి ఇన్చార్జులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని మెట్టు ప్రశ్నించారు.

స్థానిక ఎన్నికలలో ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైసిపి గెలుపు కోసం బలంగా ఎదుర్కోవాలని ఆయన కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వ నాయకుల అవినీతిపై ప్రజలకు తెలియజేయాలని ప్రజలు కూడా ఇది గమనిస్తున్నారని,అదే వైసిపి పార్టీ గెలుపుకు బలమైన పునాదులను సమావేశంలో ప్రసంగించారు . స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో వైసీపీ నాయకులందరూ ప్రసంగించగా వైసీపీ నాయకుడు గౌనిఉపేందర్ రెడ్డి సమావేశమును ఉద్దేశించి మాట్లాడకపోవడం అక్కడ పలు అనుమానాలకు తావిస్తూ చర్చనీయాంశంగా మారింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పొరాళు శివకుమార్, మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు వైసీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, గుమ్మగట్ట మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డి, రామాంజనేయులు, బ్రహ్మానంద రెడ్డి, రామాంజనేయులు రెడ్డి, సీనియర్ నాయకులు గరుడ చే డు గోపాల్ రెడ్డి, బీటీపీ గోవిందు, తదితర నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య

- 16వ జాతీయ వినియోగదారుల సదస్సు ముగింపు సభలో చైర్మన్ జి. సురేష్ కుమార్

**పుట్టపర్తి, సెప్టెంబర్ 13:అనంత జనశక్తి న్యూస్**




రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్యను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్ అన్నారు. పుట్టపర్తిలోని సాయి ఆరామం సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సు ముగింపు సభలో ఆయన మాట్లాడారు.గత 35 ఏళ్లుగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సమాఖ్య కృషి చేస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగదారులకు తమ హక్కులు, బాధ్యతలు, నాణ్యతా ప్రమాణాలు, ఆహార భద్రత, చట్టపరమైన రక్షణపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.వినియోగదారుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల అవగాహన కార్యక్రమాలకు సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబుకు, శ్రీ సత్యసాయి జిల్లా అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల చట్టాల అమలు, క్షేత్రస్థాయిలో వినియోగదారుల సంఘాల పాత్రపై విస్తృతంగా చర్చించారు. సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, అతిథులను ఘనంగా సత్కరించి ధ్రువపత్రాలు అందజేశారు. సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన సాయి ఆరామం సమావేశ మందిరం నిర్వాహకులు తోట్ల గంగాధర్‌కు సురేష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.ఎన్. మూర్తి, గౌరవ చైర్మన్ నాగేశ్వరరావు, గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు కర్లపాటి శ్రీనివాసులు, ఉషాదేవి, లావణ్య దీప్తి, భాస్కరరావు, ఆర్. శ్రీనివాసులు, తోట చిన్నప్ప, గురుమూర్తి, చిన్న తమ్మి చిన్నప్ప, పల్లం జనార్ధన్, గుర్రం వేణుగోపాల్, కేశవ, బుక్కపట్నం మండల వినియోగదారుల సంఘ సభ్యులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపు
- భక్తితో పాటు బాధ్యతగా వినాయక చవితి జరుపుకుందాం.
- వినాయక పందిళ్లకు ఉచిత విద్యుత్తుపై మంత్రి హర్షం.

**అమరావతి సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**




వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని రాష్ట్ర రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు."మట్టి వినాయకుడు.. మన పర్యావరణానికి వరం" అని, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని సూచించారు. రసాయనాలు, హానికర రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని, మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్రకృతికి మన వంతు మేలు చేసినవారమవుతామని తెలిపారు.భక్తి, సంప్రదాయాలకు పర్యావరణ పరిరక్షణను జోడిస్తూ "మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం" అనే స్ఫూర్తితో వినాయక చవితిని జరుపుకోవాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రజలను కోరారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ప్రకృతిని కాపాడగలమని అన్నారు. మనం నేడు తీసుకునే చిన్నచిన్న బాధ్యతాయుత నిర్ణయాలే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తుకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు.ప్రకృతిని కాపాడటం అంటే భవిష్యత్ తరాలను కాపాడటమేనని, భక్తితో పాటు బాధ్యతను చాటుతూ ఈ వినాయక చవితిని పర్యావరణహితంగా జరుపుకుందామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి పందిళ్లకు ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించడాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వాగతించారు.

పండుగను జరుపుకునే అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ, వేడుకలకు మరింత శోభ చేకూర్చేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు.వినాయక చవితి వేడుకల పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.గతేడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం వినాయక చవితి పందిళ్లకు ఉచిత విద్యుత్తు అందించిందని గుర్తు చేశారు. ప్రజల సంతోషం, సంప్రదాయాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్




- పర్యావరణ హితంగా పండుగను జరుపుకుందాం- మట్టి వినాయకులనే పూజిద్దాం
- శ్రీ విఘ్నేశ్వరుని దివ్య అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలకు క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు సిద్ధించాలి

**నిడదవోలు సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. "సనాతన ధర్మంలో ఏ శుభ కార్యం తలపెట్టినా, ఏ కొత్త పని ప్రారంభించినా ముందుగా ప్రథమ పూజలు అందుకునే దైవం మహాగణపతి. ఆ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మనం చేపట్టే ప్రతీ మంచి పనిలోని విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలి.ప్రజలంతా మనమంతా పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలి.ప్రకృతికి హాని కలిగించని విధంగా మట్టితో చేసిన వినాయక ప్రతిమలను మాత్రమే పూజించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ఆ గణనాథుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతీ ఇంట్లో క్షేమం, స్థైర్యం, ఆయురారోగ్యాలు మరియు సకల సంపదలు, శుభాలు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను అన్నారు.రాష్ట్ర ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో, పర్యావరణ స్పృహతో ఈ వినాయక చవితి ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.

# వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 13: అనంత జన శక్తి న్యూస్**




వినాయక చవితి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.వినాయక మండపాల వద్ద మద్యం సేవించడం, విక్రయించడం, టపాసులు పేల్చడం, అధిక శబ్దాలతో సంగీతం ఏర్పాటు చేయడం నిషేధమన్నారు. రాజకీయ, కుల, మతాలకు సంబంధించిన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, రాజకీయ జెండాలు, వర్గాలను సూచించే చిహ్నాలు ప్రదర్శించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలని సూచించారు. విగ్రహం ప్రతిష్ఠించినప్పటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి భద్రత కల్పించాలన్నారు. నిమజ్జనం తేదీ, ప్రదేశం, ఊరేగింపు మార్గం వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.నిమజ్జన వాహనాల్లో చిన్నపిల్లలు, వృద్ధులను తీసుకురావద్దని, చెరువులు, కాలువలు, బావుల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాలు మంచి స్థితిలో ఉండేలా చూసుకోవడంతో పాటు అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలన్నారు.నిమజ్జన ఊరేగింపులో అధిక శబ్దాలు, టపాసులు నివారించాలని, ముఖ్యంగా దేవాలయాలు, పాఠశాలలు, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు నివసించే ప్రాంతాల్లో శబ్ద కాలుష్యానికి పాల్పడరాదన్నారు.ఎలాంటి గొడవలు, వివాదాలకు తావులేకుండా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ సతీష్ కుమార్ కోరారు.

# నేడు పీజీఆర్ఎస్ రద్దు.

- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్....

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 13 అనంత జన శక్తి న్యూస్.**



సెప్టెంబర్ 14న పుట్టపర్తి లోని రేవెన్యు భవన్ లో జిల్లాస్థాయి, డివిజన్, మండల స్థాయిలలో నిర్వహించాల్సిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని వినాయక చవితి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని తాత్కాలికంగా రద్దు చేసినట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ లోనూ నమోదు చేసుకోగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వారు నమోదు చేసుకున్న అర్జీలు , వాటి యొక్క పరిష్కార స్థితి గురించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 కి నేరుగా సంప్రదించగలరని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి, రేపటి రోజున మండల, డివిజన్, మరియు జిల్లా స్థాయి సేవా కేంద్రాలకు అర్జీదారులు ఎవరూ రావద్దని సూచించారు. తిరిగి తదుపరి సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## అమెరికా, చైనాలను దాటి భారత్ నెంబర్-1

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే చెప్పాయి. ఇప్పుడు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ఆర్థికవేత్త జెఫ్రీ సాక్స్ భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా మారతుందని సంచలన అంచనా వేశారు. సమీపం భవిష్యత్తులో భారత్ అమెరికా, చైనాలను దాటి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. రాబోయే 25 ఏళ్లలో అమెరికాను భారత్ అధిగమించి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని, చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించవచ్చని జెఫ్రీ సాక్స్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రం నిర్ణయాత్మకంగా ఆసియా వైపు మారుతోందని సాక్స్ పేర్కొన్నారు. భారత్‌చైనాలు ఒకరికి ఒకరు అవసరమని అన్నారు. ఈ రెండు ఆసియా దిగ్గజాలు ప్రపంచ ఆర్థిక శక్తులుగా మారుతాయని, అదే సమయంలో అమెరికా మూడో స్థానానికి పడిపోతుందని జోస్యం చెప్పారు. చైనాతో భారత్‌కు లోతైన ఆర్థిక, సాంకేతిక సంబంధాలు భారత్ ఎదిగే వేగాన్ని మరింత పెంచొచ్చని వెల్లడించారు. భారత్‌కు చైనా ఎంత అవసరమో, చైనాకు భారత్ అంతే అవసరమని చెప్పారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఉన్న ఆసియా, తిరిగి మళ్లీ ఆ స్థానాన్ని చేజిక్కించుకుంటుందని జెఫ్రీ సాక్స్ అన్నారు. చైనా, ఆసియాన్, ఆఫ్రికా మరియు గల్ఫ్ దేశాలతో భారతదేశ వ్యూహాత్మక మరియు ఆర్థిక సంబంధాలు మరింత ముఖ్యమైనవిగా మారతాయని ఆయన అన్నారు.

# వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య...

**నల్లచెరువు సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రమైన నల్లచెరువు విజయలక్ష్మి కాలనీకి చెందిన కదిరి రూబీన వయసు 27 సంవత్సరాలు,భర్త కదిరి మన్సూర్,అను ఆమె తన కొడుకును దండిస్తూ ఉండగా,తన భర్త మన్సూర్ అడ్డం వచ్చి ఎందుకు పిల్లవాడిని దండిస్తున్నావు అని రుబీనాను మందలించినందుకు క్షణికావేశంలో రుబీనా తమ బెడ్ రూమ్ లోపలికి వెళ్లి గడియ పెట్టుకొని చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయిందని తెలపడంతో ఎస్సై మక్బుల్ భాష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# 2,800 మందికి ఉచిత వైద్యం.. ఉండిలో రెండు రోజుల మెగా మెడికల్ క్యాంప్



**- క్యాన్సర్ బాధితుల తదుపరి చికిత్సకు అండగా ఉంటాం: రఘురామ కృష్ణంరాజు**

**ఉండి సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**

పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఉండి హైస్కూల్ ప్రాంగణంలో శనివారం, ఆదివారం నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 2,800 మంది వైద్య సేవలు పొందారు. ఆశ్రం ఆసుపత్రి, ఏలూరు సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని వివిధ విభాగాల్లో ఉచితంగా పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, క్యాన్సర్, జనరల్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వైద్యం, పల్మనాలజీ, ఈఎన్‌టీ, కంటి వైద్యం తదితర సేవలు అందించారు. క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలతో పాటు మహిళలకు ప్రత్యేకంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.శిబిరంలో గుర్తించిన క్యాన్సర్ బాధితులు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి తదుపరి చికిత్స అందేలా తన కార్యాలయం ద్వారా సమన్వయం చేస్తామని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. అర్హత ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్సకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు శిబిరానికి వచ్చేలా 16 ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరం ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలు ఉచితంగా అందాయని నిర్వాహకులు తెలిపారు.

# ఖైరతాబాద్ వినాయకుడి మాదిరిగా 'డూండీ' గణపతి

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**విజయవాడ సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**

ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలకు మాదిరిగా డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. సంప్రదాయాలను పాటిస్తూ, పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా ఆరేళ్ల నుంచి 72 భారీ అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తూ వస్తున్న డూండీ గణేశ్ సేవా సమితి సభ్యులను అభినందించారు. ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. విజయవాడలోని విద్యాధర పురంలో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల చముఖ వరసిద్ధి మహా గణపతి భారీ విగ్రహం ఆగమన వేడుకను మంత్రి సవిత ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరవాత ఆరేళ్ల నుంచి భారీ ఎత్తున వినాయక నవరాత్రి ఉత్సవాలను దూండీ గణేశ్ సేవా సమితి నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలను ధీటుగా విజయవాడలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... డూండీ గణేశ్ సేవా సమితి మహిళా ప్రతినిధులతో కలిసి కోలాటం ఆడి సందడి చేశారు. సంప్రదాయ నృత్యకళాకారిణులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్ధా వెంకటన్న, కార్పొరేషన్ చైర్మన్లు డూండీ రాకేశ్, పేరేపీ ఈశ్వరరావు, సినీ నిర్మాత, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నెల్లూరు అభివృద్ధి ఆగదుమంత్రి నారాయణ

**బురదచల్లుడు రాజకీయాలు సాగవు**
**వైఎస్ఆర్‌సీపీ ఆరోపణలపై మంత్రి నారాయణ హాట్ కామెంట్స్**
**అర్థంపర్థం లేని ఆరోపణలకు సమాధానం అవసరం లేదు.**
**లెగసీ వేస్ట్ టెండర్ల ప్రక్రియ పారదర్శకం**
**స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే బురదచల్లే ప్రయత్నాలు**

**నెల్లూరు సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్**



వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న అర్థంపర్థం లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా నెల్లూరులో అభివృద్ధిని అడ్డుకోలేరని తేల్చి చెప్పారు.నెల్లూరులో ఆదివారం పర్యటించిన మంత్రి నారాయణ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించారు.చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆధారాలు లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు.అల్లీపురం డంపింగ్‌యార్డు సుమారు 60 ఏళ్లుగా ఉందని మంత్రి తెలిపారు. డంపింగ్‌యార్డు కారణంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి కూడా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తను పెద్దఎత్తున తొలగించామని, లెగసీ వేస్ట్‌ను శాస్త్రీయంగా తొలగించేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు.

టెండర్ల ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఈ అంశంపై అవగాహన లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**చంద్రబాబు విజన్‌తో వ్యర్థాల నుంచి విద్యుత్**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి ఉన్న నాయకుడని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని లెగసీ వేస్ట్‌ను తొలగించడంతో పాటు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు దాని నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**అవినీతికి పాల్పడాల్సిన అవసరం నాకు లేదు**

తనపై అవినీతి ఆరోపణలు చేయడంపై మంత్రి ఘాటుగా స్పందించారు.అవినీతికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం సొంత నిధులను కూడా ఖర్చు చేస్తున్నానని చెప్పారు.నెల్లూరు కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలను వీఆర్ హైస్కూల్ తరహాలో ఆధునీకరిస్తామని తెలిపారు. నగరంలో చెట్లు నాటే కార్యక్రమానికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ నిధులు వినియోగించలేదని, తన స్నేహితులు, సన్నిహితుల సహకారంతో సీఎస్ఆర్ నిధులు సమకూర్చి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

**అజీజ్‌కు సాయం చేస్తే తప్పా?**

ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌కు సహాయం చేయడాన్ని కూడా రాజకీయ రంగు పులమడం సరికాదని మంత్రి అన్నారు.ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వ్యక్తికి సహాయం చేయడం కూడా తప్పేనా? అని ప్రశ్నించారు. అవాస్తవ ఆరోపణలు, అభాండాలు కొనసాగిస్తే చివరకు నష్టపోయేది వైఎస్ఆర్‌సీపీయేనని హెచ్చరించారు.వైఎస్ఆర్‌సీపీ రాజకీయ వైఖరిపైనా మంత్రి విమర్శలు గుప్పించారు. వై నాట్ 175 అని చెప్పి 11 స్థానాలకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే అదే ఫలితం మళ్లీ పునరావృతమవుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి తీర్పు ఇస్తారని, నెల్లూరు కార్పొరేషన్‌లో అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

**నెల్లూరును బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం**

నెల్లూరును రాష్ట్రంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.234 కోట్ల నిధులు మంజూరయ్యాయని, యూజీడీ పనులకు కూడా 250 కోట్ల అదనపు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఎవరెన్ని ఆరోపణలు చేసినా,ఎన్ని కుట్రలు పన్నినా నెల్లూరు అభివృద్ధి ఆగదన్నారు.ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా కొనసాగిస్తామని తెలిపారు.నెల్లూరును బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు..

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

**(మొదటి పేజీ తరువాయి)**



రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ ఒత్తిడికి గురైన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.ఖరీఫ్2026లో సెప్టెంబర్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో 74 శాతం కాగా, గత ఏడాది ఇదే తేదీ నాటి సాగుతో పోలిస్తే 78 శాతంగా ఉందన్నారు. ప్రధాన పంటల్లో వరి 12.01 లక్షల హెక్టార్లు, పత్తి 4.11 లక్షల హెక్టార్లు, కంది 2.63 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.47 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.08 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వివరించారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని 284 మండలాలు, 1,792 ఆర్‌ఎస్‌కేలు/గ్రామాల పరిధిలో పంటలపై ప్రభావం నమోదైనట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. మొత్తం 2,44,443 హెక్టార్లలో పంటలు వివిధ స్థాయిల్లో ప్రభావితమైనట్లు తెలిపారు. ఇందులో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం, మరో 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోవడం నమోదైనట్లు వివరించారు.ఈ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ తేమ ఒత్తిడిలో ఉన్న పంటలను సాధ్యమైనంత వరకు కాపాడటమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని, అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.జిల్లాల వారీగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1,09,255 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పంటల వారీగా కంది 74,301 హెక్టార్లు, పత్తి 73,733 హెక్టార్లు, వేరుశనగ 25,818 హెక్టార్లు, మొక్కజొన్న 24,819 హెక్టార్లు, వరి 18,443 హెక్టార్లలో ప్రభావితమైనట్లు సమావేశంలో వివరించారు.

**99.76 శాతం ప్లాట్ల సర్వే పూర్తి**

ఈపంట, M&E ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.7558 కోట్ల ప్లాట్లలో 2.7493 కోట్ల ప్లాట్ల సర్వే పూర్తయిందని, తద్వారా 99.76 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 65,233 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట ఆరోగ్య వివరాలకు సంబంధించి 1.082 కోట్ల ప్లాట్లలో వివరాలు నవీకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 98.10 లక్షల ప్లాట్లలో నవీకరణ పూర్తయిందని అధికారులు వివరించారు. ఇంకా 10.10 లక్షల ప్లాట్లు, అంటే 9.34 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ పంట ఆరోగ్య వివరాల నమోదు కేవలం గణాంకాల కోసం కాకుండా, ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎలాంటి సమస్య ఉందో గుర్తించి సకాలంలో రైతుకు సహాయం అందించేందుకు అత్యంత కీలకమన్నారు. ప్రతి ప్లాట్‌లో పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న వివరాల నవీకరణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు 34,567 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, ఇంకా 95,112 హెక్టార్లను కవర్ చేయాల్సి ఉందన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సహా అవసరమైన సహకారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

**వ్యవసాయ–జలవనరుల శాఖల మధ్య నిరంతర సమన్వయం**

తేమ ఒత్తిడికి గురైన పంటలకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి రక్షక తడులు అందించడంపై వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏ ప్రాంతంలో పంటకు నీరు అత్యవసరమో గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి.సాధ్యమైన ప్రతి పంటను కాపాడాలి. రైతుకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా క్షేత్రస్థాయిలో కనిపించాలి అని మంత్రి స్పష్టం చేశారు.నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద సాగు చేసే రైతులు వరికాకుండా ఆరుతడి పంటలను పండించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ-సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్ఇన్‌చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, ఐఏఎస్ రాజమౌళి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చేతల్లో ఉంటే ఎంతోమంది జైలుకు వెళ్లేవారు

**(మొదటి పేజీ తరువాయి)**



హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న టీజీ వెంకటేశ్.. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి ఆర్యవైశ్యులంటే ఎంతో గౌరవం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు.. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఆర్యవైశ్యులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం, పదవులు ఇవ్వాలని కోరారు. తన పేరులోని టీజీ అంశాన్ని కూడా టీజీ వెంకటేశ్ ప్రస్తావించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర సంక్షిప్త నామంగా టీఎస్‌ను ఉపయోగించారని.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మళ్లీ టీజీని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇది తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తమ పూర్వీకులు తెలంగాణ ప్రాంతానికి చెందినవారేనని టీజీ వెంకటేశ్ స్పష్టం చేశారు. గతంలో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ప్రారంభించిన సందర్భాలను గుర్తుచేసుకున్న ఆయన.. ప్రజల మధ్య విభజన కాకుండా అందరినీ కలిపి ఉంచాలనే ఉద్దేశంతో ఆ ఉద్యమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఆర్యవైశ్యులకు రాజకీయ పదవులు ఇవ్వాలని టీజీ వెంకటేశ్ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పోరాటాల్లో వైశ్యులు ముందుకు రారనే అభిప్రాయం కొందరిలో ఉందని.. కానీ ప్రభుత్వాలపై ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో తమ సామాజిక వర్గం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. వైశ్యులు ప్రధానంగా వ్యాపార రంగంలో ఉండటం వల్ల నిత్యం వివిధ వర్గాల ప్రజలతో సంబంధాలు కలిగి ఉంటారని చెప్పారు. ప్రజల నాడిని తెలుసుకోవడంలో ఈ సంబంధాలు ఉపయోగపడతాయని టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతుగా రూ.కోటి విరాళంగా అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇదే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల సామాజిక, ఆర్థిక, రాజకీయ పాత్రను ప్రస్తావించారు. ఎంతటి కష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఆత్మగౌరవాన్ని వదులుకోని మనస్తత్వం ఆర్యవైశ్యుల సొంతమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కష్టసమయాల్లో ప్రజలకు అండగా నిలిచే వర్గాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారని అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఆర్యవైశ్యులు తమకు తగిన రాజకీయ వాటాను సాధించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సమైక్యంగా ఉంటేనే రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేషన్‌తో పాటు స్థానిక సంస్థల్లో ఆర్యవైశ్యులకు ప్రాతినిధ్యం కల్పించిందని చెప్పారు. ఆర్యవైశ్య పేద కుటుంబాల పిల్లలకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన మాటను తప్పనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కె. రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని కూడా రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో క్రమశిక్షణ, అనుభవంతో ముందుకు సాగేందుకు రోశయ్య తనకు మార్గదర్శనం చేశారని చెప్పారు.

తెలంగాణ ఆవిర్భావ సమయంలో రాష్ట్రానికి మిగులు బడ్జెట్ ఉండటంలో రోశయ్య ఆర్థిక మంత్రిగా తీసుకున్న నిర్ణయాలు.. చూపిన దూరదృష్టి కీలకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఆర్యవైశ్య ప్రముఖుల పాత్రను కూడా సీఎం రేవంత్ ప్రస్తావించారు. మహాత్మా గాంధీ నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వరకు పలువురు ప్రముఖులు సమాజంపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు.

# కల్తీ మద్యం సేవించి తొమ్మిది మంది మృతి

**నాగాలాండ్, సెప్టెంబర్ 13, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి తొమ్మిది మంది మరణించారని నాగాలాండ్ డీజీపీ రుపిన్ శర్మ వెల్లడించారు. వీరంతా టుయెన్‌సాంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. కల్తీ మద్యం తాగి వీరంతా మరణించినట్లు నివేదిక అందడంతో రాష్ట్రవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు చెప్పారు. దీనిపై విచారణ జరుగుతోందన్నారు. మూన్, మోకోక్‌చుంగ్, టుయెన్‌సాంగ్, లాంగ్‌లెంగ్, కిఫైర్, షమాటోర్, నోక్లాక్ జిల్లాలోని ప్రజలెవరూ మద్యం సేవించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితిపై స్పష్టత వచ్చే వరకు రాష్ట్రంలో ఇతర జిల్లాల్లోని ప్రజలు కూడా మద్యానికి దూరంగా ఉండాలని డీజీపీ రూపిన్ శర్మ కోరారు.

అపరిచితులు లేదా అనధికారికంగా విక్రయించే మద్యాన్ని సేవించవద్దని ప్రజలను ఆయన హెచ్చరించారు. ఈ కల్తీ మద్యం ఎక్కడి నుంచి సరఫరా అయిందో గుర్తించేందుకు.. అందుకు కారణమైన వారిని పట్టుకునేందుకు పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. నాగాలాండ్‌లో 1989 టోటల్ లిక్కర్ ప్రొహిబిషన్ యాక్ట్ అమల్లో ఉంది. అయినా అక్రమ మద్యం మార్కెట్లతోపాటు కల్తీ మద్యం వ్యాపారం జోరుగా సాగడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

అస్సాంతో నాగాలాండ్‌కు ఉన్న సరిహద్దు ద్వారా అక్రమ మద్యం సరఫరా వెల్లువెత్తుతోంది. దాంతో నాగాలాండ్‌లోని సరిహద్దు పట్టణాల్లో మాఫియా ముఠాలు అక్రమ, కల్తీ మద్యం స్థావరాలు భారీగా ఏర్పాటు చేసుకున్నాయి. అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల ఏటా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. అలాగే పర్యాటక, హోటల్, ఆతిథ్య రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరో వైపు అక్రమ రవాణా వల్ల మద్యం ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని యువత డ్రగ్స్ వైపు మళ్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



# గణపయ్య వచ్చాడు.... సందడి తెచ్చాడు



**ధర్మవరం సెప్టెంబర్ 13 అనంత జనశక్తి న్యూస్ :**

**ఒకానొక కాలంలో, మహాశివుడి ఆవాసమైన కైలాస పర్వతం మంచు శిఖరాల మధ్య ప్రశాంతంగా ప్రకాశిస్తోంది. ఒకరోజు జగజ్జనని పార్వతీదేవి స్నానానికి వెళ్లే ముందు, తనకు రక్షణగా ఎవరూ లేరని భావించింది. వెంటనే ఆమె తన శరీరానికి పూసుకున్న నలుగు పిండిని తీసి, ఎంతో ప్రేమతో ఒక చిన్న బాలుడి రూపంగా మలిచింది. ఆ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయగానే, అత్యంత కాంతివంతమైన, తేజస్సు కలిగిన ఒక సుందర బాలుడు ప్రాణం పోసుకుని నిలబడ్డాడు.**

... వినాయక చవితి సందర్భంగా అనంత జనశక్తి ప్రత్యేక కథనం....
-అనంత జనశక్తి పాఠకులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు.
-వినాయకుడు రాక... పండుగకు ఊపొచ్చింది..!
-లంబోదరుడు కొలువు... భక్తికి వెలుగు.
-గణనాథుడి ప్రతిష్టతో ప్రతి వీధిలో పండుగ వాతావరణం.
-ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న మండపాలు... మార్మోగినా గణపతి నామస్మరణ.
-యువత ఉత్సాహం... భక్తుల సందడి... కన్నుల పండుగగా గణేష్ ఉత్సవాలు.
-గణపతి అడుగు పెట్టాడు... యువతకు ఉత్సాహం తెచ్చాడు.
-ఘనంగా ఏర్పాట్లు... భక్తిశ్రద్ధలతో ఉత్సవాలకు శ్రీకారం.
-ప్రాంతాలు వేరైనా... భక్తి ఒకటే...!





**ప్రాంతాలు వేరైనా.. భక్తి ఒక్కటే....**
**ముంబైలో లాల్‌బాగ్చా రాజా..**
**హైదరాబాద్‌లో ఖైరతాబాద్ మహాగణపతి..**

బాలాపూర్‌లో లడ్డూ వేలం.. పుణేలో దగ్డూశేత్ గణపతి.. మహారాష్ట్రలో అష్టవినాయక క్షేత్రాలు..తమిళనాడులో పిళ్లయ్యార్పట్టి.. కర్ణాటకలో ఇడగుంజి.. పేర్లు వేరు.. రూపాలు వేరు.. సంప్రదాయాలు వేరు.. కానీ ప్రతి చోటా వినాయకుడిపై భక్తి మాత్రం ఒక్కటే. అందుకే గణేష్ చతుర్థి భారతీయ సంస్కృతిలో ఒక ప్రత్యేకమైన పండుగగా నిలిచింది. భక్తిని పెంచడంతో పాటు ప్రజలను ఒక్కచోటికి చేర్చి, మన సంప్రదాయాలను తరువాతి తరాలకు పరిచయం చేసే గొప్ప వేదికగా నిలుస్తోంది.

"అమ్మా!" అంటూ ఆ చిన్నారి పార్వతీదేవికి నమస్కరించాడు. పార్వతీదేవి ఆనందంతో బాలుడిని గుండెలకు హత్తుకుని, "నాయనా! నేను స్నానానికి వెళ్తున్నాను. నేను తిరిగి వచ్చే వరకు ఎవరినీ లోపలికి రానివ్వకుండా గుమ్మం దగ్గరే కాపలా ఉండు" అని ఆజ్ఞాపించి, చేతికి ఒక దండాన్ని ఇచ్చింది. ఆ బాలుడు తల్లి ఆజ్ఞను శిరసావహించి భవనం ముందు నిలబడ్డాడు. సరిగ్గా అదే సమయానికి పరమశివుడు కైలాసానికి తిరిగొచ్చాడు. తన స్వగృహంలోకి వెళ్లబోతున్న శివుడిని ఆ చిన్నారి అడ్డుకున్నాడు. "ఆగండి! మా అమ్మ లోపల ఉంది. ఆమె అనుమతి లేనిదే మిమ్మల్ని లోపలికి వెళ్లనివ్వను" అని గంభీరంగా చెప్పాడు. తల్లి ఇచ్చిన ఆజ్ఞే ఆ బాలుడికి సర్వస్వం. ఎదురుగా నిలబడింది సాక్షాత్తు ముక్కంటి అనే నిజం ఆ బాలుడికి తెలియదు, అలాగే ఆ చిన్నారి తన కుమారుడే అనే విషయం శివుడికీ తెలియదు. శివుడు ఎంత చెప్పినా బాలుడు వినలేదు. శివుడి భూతగణాలు ఆ బాలుడితో యుద్ధానికి దిగాయి. కానీ ఆ చిన్నారి ఒంటరిగానే శివగణాలన్నింటినీ తన దండంతో తరిమికొట్టాడు. దీంతో ఆగ్రహించిన పరమశివుడు తన త్రిశూలాన్ని ప్రయోగించాడు. క్షణంలో ఆ బాలుడి శిరస్సు తెగి దూరంగా పడిపోయింది. స్నానం ముగించుకుని బయటకు వచ్చిన పార్వతీదేవి, రక్తమడుగులో పడి ఉన్న తన కుమారుడిని చూసి రోదించింది. ఆమె క్రోధంతో విశ్వాన్ని దహించివేసేంత ఉగ్రరూపం దాల్చింది. "నా కుమారుడిని బ్రతికించకపోతే ఈ సృష్టిని అంతం చేస్తాను" అని హెచ్చరించింది. పరిస్థితి తీవ్రతను గ్రహించిన పరమశివుడు, వెంటనే తన దేవతలను పిలిచి, "ఉత్తర దిక్కుగా తలపెట్టి నిద్రపోతున్న ఏ జీవి కనిపించినా, దాని తలను వెంటనే తీసుకురండి" అని ఆదేశించాడు. దేవతలు వెతకగా వారికి ఒక గజం (ఏనుగు) కనిపించింది. వారు ఆ ఏనుగు తలను తెచ్చి శివుడికి ఇచ్చారు. పరమశివుడు ఆ గజ శిరస్సును బాలుడి ధడమునకు అమర్చి ప్రాణప్రతిష్ఠ చేశాడు. వెంటనే ఆ బాలుడు లేచి నిలబడ్డాడు! పార్వతీదేవి ఆనందానికి హద్దులు లేవు. కానీ ఆ విచిత్ర రూపాన్ని చూసి బాలుడు బాధపడకూడదని, శివుడు సమస్త దేవతల సమక్షంలో ఆ బాలుడికి దివ్య వరాలను ప్రసాదించాడు. "నేటి నుండి నీవు 'విఘ్నేశ్వరుడవు'. సమస్త ప్రమథ గణాలకు అధిపతివై 'గణపతి'గా పూజలందుకుంటావు. భూలోకంలో ఏ మనుష్యుడైనా, దేవతలైనా సరే... ఏ శుభకార్యం తలపెట్టినా, మొదట నీకు పూజ చేయకుండా ఆ కార్యాన్ని ప్రారంభిస్తే అది పూర్తి కాదు. నిన్ను పూజించిన వారికి సకల విఘ్నాలు తొలగి విజయం వరిస్తుంది!" అని ఆశీర్వదించాడు. ఆ రోజే భాద్రపద శుద్ధ చతుర్థి! నాటి నుండి నేటి వరకు లోకమంతా ఆ విఘ్న వినాశకుడిని, బుద్ధి ప్రదాతను ప్రథమ పూజ్యుడిగా ఆరాధిస్తూనే ఉంది.

**"దేశమంతా గణపతి వైభవం" ఒక్కో ప్రాంతంలో ఒక్కో ప్రత్యేకత.. భక్తి మాత్రం ఒక్కటే.....**

ముంబై లాల్‌బాగ్చా రాజా నుంచి హైదరాబాద్ ఖైరతాబాద్ మహాగణపతి వరకు.. దేశవ్యాప్తంగా వైభవంగా వినాయక చవితి

వినాయక చవితి వచ్చిందంటే దేశమంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలోనూ గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, భజనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలను జరుపుకుంటారు. అయితే దేశంలోని అన్ని ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు ఒకేలా ఉండవు. ప్రాంతానికో సంప్రదాయం.. క్షేత్రానికో విశిష్టత.. ఉత్సవానికో ప్రత్యేక గుర్తింపు కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో భారీ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే.. మరికొన్ని ప్రాంతాల్లో పురాతన ఆలయ సంప్రదాయాలు భక్తులను ఆకట్టుకుంటాయి.

**ముంబైలో లాల్‌బాగ్చా రాజా.. ప్రత్యేక ఆకర్షణ**

మహారాష్ట్రలో వినాయక చవితి ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా ముంబైలోని లాల్‌బాగ్చా రాజా గణపతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. గణనాథుడిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఉత్సవాల సమయంలో ముంబై నగరం మొత్తం గణపతి నామస్మరణతో మార్మోగుతుంది. మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిమజ్జనం సందర్భంగా జరిగే శోభాయాత్రలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**హైదరాబాద్ ఖైరతాబాద్.. భారీ గణపతికి ప్రత్యేక గుర్తింపు....**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో వినాయక చవితి వేడుకలకు ప్రత్యేక శోభ ఉంటుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలు నగరానికే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ప్రతి ఏడాది విభిన్న ఆకృతులు, అలంకరణలతో గణపతిని ప్రతిష్ఠించడం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. మహాగణపతిని దర్శించుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.

**బాలాపూర్ లడ్డూ.. వేలంలో ఆసక్తి....**

హైదరాబాద్‌లోని బాలాపూర్ గణేష్ ఉత్సవం మరో ప్రత్యేకత. ఇక్కడ గణపతి లడ్డూ వేలం వేయడం ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం. వేలంలో లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు, స్థానికులు ఆసక్తి చూపుతారు. లడ్డూ వేలం సమయంలో నమోదయ్యే ధరలు ప్రతి ఏడాది ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఈ సంప్రదాయం బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

**పుణే దగ్డూశేత్ గణపతి.. భక్తి వైభవం....**

మహారాష్ట్రలోని పుణేలో దగ్డూశేత్ హల్వాయి గణపతి ఉత్సవాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. భారీగా నిర్వహించే అలంకరణలు, ప్రత్యేక పూజలు, భక్తుల రద్దీతో ఈ ఉత్సవాలు వైభవంగా సాగుతాయి. గణపతిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. పుణే నగరంలోని గణేశ్ ఉత్సవాలకు చారిత్రకంగా కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది.

**అష్టవినాయక యాత్ర.. ఎనిమిది క్షేత్రాల విశిష్టత....**

మహారాష్ట్రలో గణపతి భక్తులకు అష్టవినాయక క్షేత్రాలు ఎంతో ప్రత్యేకమైనవి. ఎనిమిది ప్రసిద్ధ వినాయక ఆలయాలను దర్శించుకునే సంప్రదాయాన్ని అష్టవినాయక యాత్రగా పిలుస్తారు. ప్రతి క్షేత్రానికి ప్రత్యేకమైన స్థలపురాణం, ఆరాధనా సంప్రదాయం ఉంది. అందుకే గణపతి భక్తులు ఈ క్షేత్రాలను దర్శించుకోవడాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు.

**తమిళనాడులో పిళ్లయ్యార్పట్టి.. రాతిలో కొలువైన గణపతి....**

తమిళనాడులోని పిళ్లయ్యార్పట్టి కర్పక వినాయకర్ ఆలయం కూడా ప్రముఖ వినాయక క్షేత్రంగా గుర్తింపు పొందింది. రాతిలో చెక్కిన వినాయకుడి విగ్రహం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణ. పురాతన శిల్పకళ, ఆలయ నిర్మాణశైలి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు భక్తులను ఆకట్టుకుంటాయి. వినాయకుడి ఆరాధనకు దక్షిణ భారతదేశంలో ఉన్న ప్రాధాన్యాన్ని ఈ క్షేత్రం ప్రతిబింబిస్తుంది.

**కర్ణాటకలో ఇడగుంజి.. భక్తుల విశ్వాస క్షేత్రం...**

కర్ణాటకలోని ఇడగుంజి వినాయక క్షేత్రం కూడా ప్రసిద్ధి చెందిన గణపతి ఆలయాల్లో ఒకటి. పురాతన సంప్రదాయాలతో కొనసాగుతున్న ఈ క్షేత్రానికి ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక్కడి ఆలయ వాతావరణం, పూజా విధానాలు, స్థానిక సంప్రదాయాలు గణపతి భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయి.

**తిలక్ నుంచి సామూహిక ఉత్సవాల వరకు.. చరిత్రలోనూ ప్రత్యేక స్థానం....**

వినాయక చవితి ఉత్సవాలకు చరిత్రలోనూ ప్రత్యేక స్థానం ఉంది. మహారాష్ట్రలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను సామూహికంగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రోత్సహించారు. దీంతో గణపతి ఉత్సవాలు క్రమంగా ప్రజలను ఒకచోటికి చేర్చే సామాజిక, సాంస్కృతిక వేదికగా మారాయి. అలా కాలక్రమేణా వినాయక చవితి కేవలం కుటుంబాలకే పరిమితమైన పండుగ కాకుండా సామూహిక భాగస్వామ్యం, సామాజిక ఐక్యత, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా రూపుదిద్దుకుంది.

**వినాయకుడు వస్తే ఇంటికి పండుగ.....**

వీధికి సందడి ఊరికి ఉత్సాహం దేశానికి సంస్కృతి వైభవంగణపతి బప్పా మోరియా.. మంగళమూర్తికి జై! గణనాథుడి రాకతో వాడవాడలా పండుగ శోభ.. భక్తి పారవశ్యంలో మునిగిన భక్తజనం. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన గణపయ్యకు వేదమంత్రోచ్ఛారణలు, మంగళహారతులు, పుష్పార్చనలు, నైవేద్యాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు గణనాథుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ప్రార్థించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు. గణపయ్య ఆశీస్సులతో చేపట్టిన ప్రతి కార్యం విజయవంతం కావాలని, జీవితాల్లో ఎదురయ్యే ఆటంకాలన్నీ తొలగి కొత్త అవకాశాలకు మార్గం సుగమం కావాలని ఆకాంక్షించారు. గణనాథుడి నామస్మరణతో మార్మోగిన వీధులు.. భక్తుల జయజయధ్వానాలతో పులకించిన పరిసరాలు.. పండుగ వాతావరణానికి మరింత వన్నె తెచ్చాయి. భక్తి, ఐక్యత, ఆనందం కలగలిసిన ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మంగళమూర్తిని కొలిచారు. "గణపతి బప్పా మోరియా" అంటూ భక్తులు చేసిన నినాదాలతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. మంగళమూర్తి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని.. గణనాథుడి కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని భక్తులు మనసారా కోరుకున్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు









## సడెన్‌గా ఫ్రేమ్‌లోకి వచ్చిన త్రిష.. ముఖం తిప్పేసుకున్న విజయ్.. వీడియో వైరల్



గత కొంతకాలంగా తమిళనాడు సినీ, రాజకీయాల్లో బాగా వినిపిస్తున్న పేరు త్రిష సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పేరు మరింత ట్రెండ్ అయింది. ప్రతిపక్ష నాయకులు సైతం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ పేరు ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. తాజాగా మరోసారి త్రిష, విజయ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. ప్రస్తుతం సీఎం విజయ్ యూకే పర్యటనలో ఉన్నారు. రేసింగ్ ఈవెంట్స్‌లో భాగంగా సినీ నటుడు అజిత్ కూడా అక్కడే ఉన్నారు. ఈ సంద ర్భంగా ఇద్దరు హీరోలు కలుసుకున్నారు. అనంతరం జరిగిన రేసింగ్ ఈవెంట్‌ను విజయ్ గ్యాలరీ నుంచి వీక్షిస్తుండగా సడెన్‌గా త్రిష మధ్యలోకి వచ్చారు. దీంతో విజయ్ కాస్త ఇబ్బందిపడ్డారు. వెంటనే తన ముఖం వీడియోలో పడకుండా పక్కకు తిప్పకొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## .టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో... దోరతి



కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'దోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం.

ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'దోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన దోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.



## కాకా.. ధూమ్ ధమాకా!

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు. "కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక" అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.

## డిమాండ్ చేస్తే యాక్షన్‌కీ వెనకాడను!



"అడుక్కునే వాళ్లకి కూడా ఆదివారం ఉంటుంది కానీ ఈ అప్పుల వాళ్లకి ఉండదు" అంటున్నారు చిట్టిబాబు. మరి ఆయనెవరు.. తన కుటుంబ కథేంటి? తెలియాలంటే 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చూడాల్సిందే. వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

"డబ్బుకీ.. సబ్బుకీ ఓ పోలికుంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది. రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది" అంటూ చిట్టిబాబుగా వెంకీ చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం అలరించేలా సాగింది. సగటు మధ్యతరగతి ఉద్యోగిగా చిట్టిబాబు జీవితాన్ని.. భార్య చేసే అప్పుల వల్ల తను పడే తిప్పల్ని ఈ ప్రచార చిత్రంలో ఫన్నీగా చూపించారు. వాళ్లంతా అకస్మాత్తుగా ఒక్కరాత్రిలో ధనవంతులుగా మారడం.. దానివల్ల ఆ కుటుంబానికి ఎదురైన చిక్కులు.. అందులో నుంచి బయట పడేందుకు భార్యాబిడ్డలతో కలిసి చిట్టిబాబు చేసిన సాహసాలు టీజర్‌లో ఆసక్తిరేకెత్తించాయి. "నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని నాకు తెలుసు. కానీ, సిట్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనకాడను" అంటూ వెంకీ చేసిన యాక్షన్ హంగామా ఆకట్టుకుంది. "నది గట్టు దాటితే వరదంటారు. అదే సముద్రం దాటితే ఉప్పెనంటారు. కానీ, సామాన్యుడు దాటితే.! బలమైన పదం.. స్ట్రాంగ్ సౌండ్ వచ్చేది మీరే వెతకండి సర్" అంటూ ఆఖర్లో ఓ పోలీసుతో వెంకటేశ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్ర హణం: రవి కె చంద్రన్.

## క్షమించేస్తా.. ప్రతీకారం తీర్చుకొనే వ్యక్తిని కాదు: స్మృతి మంధాన



ప్రస్తుత భారత మహిళా క్రికెట్‌లో స్మృతి మంధాన సూపర్ స్టార్. ఇటీవలే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ ఘనత సాధించింది. ప్రస్తుతం ఆసియా కప్ ఫైనల్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మంధాన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొంది. సదరు వ్యాఖ్యాత రాజ్ షమాని అడిగిన ప్రశ్నకు మంధాన కాస్త భావోద్వేగానికి గురైంది. తాను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతానని మంధాన వ్యాఖ్యానించిన వీడియో వైరల్‌గా మారింది.

షమాని: మీ జీవితంలో ఇప్పటి వరకు ఎదుర్కొన్న అత్యంత కఠినమైన రాత్రి ఏది?

కాసేపు ఆలోచించిన మంధాన స్పందిస్తూ.. "వరల్డ్ కప్ గురించి అనుకుంటా' అని వ్యాఖ్యానించింది. ఆ వెంటనే భావోద్వేగానికి గురైంది. "నేను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతా" అని చెప్పిన ఆమె కొవిడ్ సమయం కూడా అత్యంత కఠినమైందిగా పేర్కొంది. గతంలో పలాశ్ ముచ్చల్‌తో పెళ్లి వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. అర్ధంతరంగా రద్దు కావడంతో కొన్నాళ్లు ఆమె మానసికంగానూ ఇబ్బంది పడింది. ఇప్పుడు ఆ ఘటనను గుర్తుకొచ్చి ఉంటుందని పలువురు కామెంట్ చేస్తున్నారు.

### క్షమిస్తా కానీ.. మరిచిపోను

తన క్యారెక్టర్‌పై మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "ఎవరూ నాకు అంత దగ్గరగా అనిపించరు. కానీ, నాకు చాలా కోపం వస్తుంది. అందుకే నాతో పెట్టుకోవద్దు అనే ధోరణితో ఉండేదాన్ని. నేను మీ దారికి అడ్డురానంత వరకూ.. నా దారికి అడ్డు రావద్దని కోరుకుంటా. నేనేమీ ప్రతీకారం తీర్చుకొనే వ్యక్తిని కాదు. అలాగని వెంటనే మరిచిపోను. ఎవరికీ చెడు మాత్రం చేయను. మనుషులను క్షమిస్తా కానీ... ఆ ఘటనను మరిచిపోను" అని మంధాన తెలిపింది.

## 80ల్లోకి వెళ్లిన టీమ్ఇండియా



ఇప్పుడు ఏ సామాజిక మాధ్యమం తెరిచినా.. 1980 నాటి అవతారంతో ఉన్న ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఈ ట్రెండ్ టీమ్ ఇండియాను కూడా తాకింది. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం ఫొటోషూట్‌కు వచ్చిన భారత క్రికెటర్లను బీసీసీఐ ఆశ్చర్య పరి చింది. ఒక బల్ల మీద ప్రస్తుత భారత క్రికెటర్ల 1980 లుక్ ఫొటోలను పరిచింది. బెల్ బాటమ్ జీన్స్, పెద్ద సన్‌గ్లాసెస్, రెట్రో హెయిర్‌స్టైల్స్‌తో ఉన్న తమ చిత్రాలను క్రికెటర్లు చాలా ఉత్సాహంగా తిలకించారు. అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ వాటిని చూసి బిగ్గరగా నవ్వేశారు. సహచరులకు తమ ఫొటోలను చూపించారు. బుమ్రా, సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబె, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ఫొటోలను ఆసక్తికరంగా తిలకించిన వీడియోను బీసీసీఐ 'ఎక్స్'లో పంచుకుంది.

## 'ఆదర్శ క్రికెటర్'.. ఈ మిస్టర్ డిపెండబుల్



స్పోర్ట్స్ న్యూస్

రాహుల్ ద్రవిడ్ జీవితం నేటి తరం కుర్రాళ్లకో పెద్ద పాఠం. ఇదేదో కేవలం అతడి ఆటను ఉద్దేశించి మాత్రమే కాదండోయ్.. జట్టుకు ఎప్పుడు, ఎక్కడ అవసరమైతే అక్కడ ముందుండేవాడు. అందుకే అతడు 'ది వాల్'గా మారాడు. మిస్టర్ డిపెండబుల్‌గా అందరితో పిలిపించుకొంటూ ఇప్పుడు ఓనర్‌గానూ మారిపోయాడు.

### ఎన్ని పాత్రలు పోషించాడో..

1996లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన ద్రవిడ్ తొలుత ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ తర్వాత ఒక్కొక్క అడుగు ముందుకేస్తూ మిడిలార్డర్‌కు చేరాడు. కొన్నాళ్లకు వన్‌డౌన్‌లో కీలక ఆటగాడిగా మారిపోయాడు. సచిన్, గంగూలీ, లక్ష్మణ్‌తో కలిసి భారత జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. టెస్టుల్లో గంటలతరబడి క్రీజ్‌లో పాతుకుపోయి ది వాల్‌గా అవతరించాడు. ప్రత్యర్థుల బౌలింగ్‌ను తట్టుకొని మిస్టర్ డిపెండబుల్‌గా నిలిచాడు. మరి బ్యాటింగ్‌కే అతడిపై ఇన్ని ప్రశంసలా? అని అనిపించకమానదు. కానీ, జట్టు కోసం ద్రవిడ్ చేసిన త్యాగాలు తక్కువేం కాదు.

### ఆ గడ్డుకాలంలోనూ..

ఇప్పుడంటే నాణ్యమైన వికెట్లు కీపర్లు మనకు బోలెడు మంది. దినేశ్ కార్తిక్, ధోని రాక ముందు వరకూ దాదాపు ఆరేడేళ్లపాటు వికెట్ కీపర్ల విషయంలో మనకు గడ్డుకాలమే. ఎప్పుడైతే ధోని అడుగు పెట్టాడో దాదాపు దశాబ్దన్నరపాటు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. కానీ, 1999 నుంచి 2004 వరకూ సరైన బ్యాటింగ్ కమ్ వికెట్ కీపింగ్ ప్లేయర్ లేడంటే నమ్మగలమా? నయాన్ మోంగియా ఉన్నా అతడు వికెట్ కీపింగ్‌లో ఫర్వాలేదు కానీ.. గొప్ప బ్యాటర్‌గా మాత్రం కాలేకపోయాడు. అప్పటికే ఆసీస్‌కు ఆడమ్ గిల్‌క్రిస్ట్, దక్షిణాఫ్రికాకు మార్క్ బౌచర్, శ్రీలంక తరఫున కుమార్ సంగక్కర వంటి అద్భుతమైన స్కిల్డ్ బ్యాటింగ్ కమ్ వికెట్ కీపర్లు ఉండేవారు.

దీంతో నాటి పరిస్థితులను బట్టి భారత్ తన తుది జట్టులో అదనంగా బ్యాటర్‌ను తీసుకోవాలంటే ఎవరైనా బౌలర్‌పై వేటు వేయాల్సిన పరిస్థితి. అందుకోసం అప్పడున్న ఆటగాళ్లలోనే ఒకరికి వికెట్ కీపింగ్ బాధ్యతలు ఇచ్చి.. అదనంగా స్పెషలిస్ట్ బ్యాటర్‌ను తీసుకొనేందుకు మేనేజ్‌మెంట్ ఆలోచనలు చేసింది. 'నేనున్నానంటూ' ద్రవిడ్ ముందుకొచ్చాడు. అప్పటికి అతడేమీ అంతర్జాతీయంగా రెగ్యులర్ వికెట్ కీపర్ కాదు. అయినా సరే జట్టు కోసం కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇలా సుమారుగా 70కిపైగా వన్డేల్లో కీపింగ్ బాధ్యతలను నిర్వర్తించాడు. 2003 వన్డే ప్రపంచ కప్‌లోనూ పలు మ్యాచులకు కీపింగ్ చేశాడు.

క్రికెటర్‌గా కెరీర్‌ను ముగించిన రాహుల్ ద్రవిడ్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గానూ పనిచేశాడు. అంతకుముందు టీమ్ఇండియా A టీమ్‌కూ శిక్షణ బాధ్యతలు నిర్వర్తించాడు. ఇక ఐపీఎల్‌లోనూ మెంటార్, కోచ్‌గా మారాడు. ఇటీవల ఓ లీగ్‌లో టీ20 జట్టుకు సహయజమాని కావడం గమనార్హం. యూరోపియన్ లీగ్‌లో ఓ జట్టు కొనుగోలులో అతడు భాగస్వామి.

చివరిగా: ప్రతిభ ఒక్కటే కాదు.. త్యాగం, కష్టం ఉన్న రాహుల్ ద్రవిడ్ క్రికెటర్‌గా తన కలను నెరవేర్చుకోవడం నుంచి ఓ జట్టుకు యజమానిగా మారడం వరకూ అతడి జీవితం ఇప్పటి తరానికి ఆదర్శప్రాయమే కదా.. తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకొనేందుకు చివరి వరకూ శ్రమించే ద్రవిడ్ నోట ఎప్పుడూ పరుష పదం రాలేదు. తన ఆటతోపాటు వ్యక్తిత్వమే అందుకు అందుకు సమాధానం.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314